
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 5 డిసెంబరు 2025



కుండపోత వర్షం

- ఉధృతంగా ప్రవహిస్తున్న గుంజనేరు, పాములేరు, పుల్లంగేరు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- చిట్వేలి-రాపూరు మధ్య నిలిచిపోయిన రాకపోకలు
- రోడ్లలో ప్రవహిస్తున్న నీటితో ప్రయాణికులకు ఇక్కట్లు
- వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్ నిశాంత్‌కుమార్



రైల్వేకోడూరులో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు



రైల్వేకోడూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న గుంజన నది

రాజంపేట/రైల్వేకోడూరు/చిట్వేలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో బుధవారం రాత్రంతా కుండపోత వర్షం కురవడంతో ఒక్కసారిగా జనజీవనం స్తంభించింది. ఇటు నెల్లూరు, అన్నమయ్య, అటు శేషాచలం అడవుల్లో భారీ వర్షాలు కురవడంతో గుంజనేరు పరవళ్లు తొక్కుతోంది గుంజన నది ఉధృతంగా ప్రవహిస్తుండంతో రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరులలో నది పరీవాహక ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. నెల్లూరు సరిహద్దు అడవుల్లో కురుస్తున్న వర్షం వల్ల వాగులు, వంకలు ఉప్పొంగి రాజుకుంట క్రాస్ రోడ్డు వద్ద యల్లమరాజుచెరువు నీరు ఎక్కువ కావడంతో రాపూరు-చిట్వేలి మధ్య రాకపోకలు స్తంభించాయి. దీంతో రాజంపేట, కోడూరు చిట్వేలి, రాపూరు ఘాట్ రోడ్డు గుండా వెళ్లే నెల్లూరు, వెంకటగిరి, రాపూరు, గూడూరు, విజయవాడ బస్సులు రద్దయ్యాయి. దీంతో చిట్వేలి మండలంలోని అనుంపల్లె గ్రామస్థులకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. చిట్వేలిలోని రాచపల్లె- కొత్తపల్లె మధ్య లోలెవల్ బ్రిడ్జిపై వరద నీరు పొంగి ప్రవహిస్తుండడంతో ఆ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పుల్లంగేరు ఉధృతంగా ప్రవహిస్తుండడం వల్ల రాజంపేట మండలం ఊటుకూరు నుంచి కొండ్లోపల్లె చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లే రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. కోడూరు ప్రాంతంలో పూర్తిగా కుండపోత వర్షం కురవడంతో గుంజనేరు వల్ల రెడ్డివారిపల్లె, చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతి వల్ల ఇప్పటివరకు చుక్కనీరు లేని ఊటుకూరు, రెడ్డిపల్లె, చెర్లోపల్లె, హస్తవరం, ఆకేపాడు, తాళ్లపాక, నగిరిపాడు, నాగవరం తదితర చెరువులకు భారీగా వరద నీరు చేరుతోంది. రైల్వేకోడూరు మండలంలోని చెరువులన్నింటిలో వరదనీరు చేరడంతో అలుగులు పారుతున్నాయి. వర్షాలతో రైతులు పొలాలవైపు వెళ్లడం లేదు. ఉద్యాన పంటలైన అరటి తోటల్లో భారీగా వరద నీరు చేరడంతో కోతలు ఆగిపోయాయి. వారం రోజులుగా ఉద్యాన పంటలపై ఆధారపడి ఉన్న కూలీలు భవన నిర్మాణాలపై ఆధారపడి ఉన్న కూలీలకు పనులు లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. గుంజననది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతాల వారిని పోలీసులు, రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. బోళాశంకర్ సేవాసమితి అధ్యక్షుడు మందల నాగేంద్ర ఆధ్వర్యంలో పేదలకు ఆహార పొట్లాలు అందజేశారు. రైల్వేకోడూరు పట్టణంలోని పలు వీధి రోడ్లు జలమయమయ్యాయి. వ్యాపార దుకాణాల్లోకి వరద నీరు చేరడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. గురువారం సాయంత్రం వర్షం తగ్గుముఖం పట్టింది. రాజంపేట సబ్‌కలెక్టర్ నేతృత్వంలో రెండు నియోజకవర్గాల్లోని రెవెన్యూ, పంచాయతీ, ఇతర శాఖల అధికారులు ఆయా గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో కలిసి అప్రమత్తమయ్యారు. నది పరీవాహక ప్రాంతాల్లోకి వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేశారు. కొన్నిచోట్ల నదులు, కాలువల్లోకి వెళ్లవద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.



చిట్వేలి వద్ద కల్వర్టుపై ప్రవహిస్తున్న వరద నీరు

పుల్లంగేరు ఉధృతిని పరిశీలించిన కలెక్టర్

పుల్లంపేట మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పుల్లంగేరును కలెక్టర్ నిశాంత్‌కుమార్, సబ్‌కలెక్టర్ భావన పరిశీలించారు. పుల్లంగేరు నుంచి పుల్లంపేట చెరువుకు నీరు అందించే కాలువల్లో పూడికతీతను పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులను ఆదేశించారు. వరద పరిస్థితిపై రెండు నియోజకవర్గాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలు, స్థానిక అధికారులను ఆదేశించారు.



పుల్లంగేరును పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, సబ్ కలెక్టర్ భావన



ఊటుకూరు వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న పుల్లంగేరు



చిట్వేలి మండలం రాచపల్లెలో లోలెవల్ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నీరు

వైభవంగా సీతారాముల పౌర్ణమి కల్యాణం



స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజున ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అందులో భాగంగా గురువారం వేకువజామునే ఆలయ అర్చకులు వీణారాఘవాచార్యులు, మనోజ్‌కుమార్‌లు మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు శ్రావణ్‌కుమార్, పవన్ కుమార్‌లు వేదమంత్రోచ్ఛారణల మధ్య మాంగల్యధారణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

డీడీవో కార్యాలయాన్ని ప్రారంభించిన కలెక్టర్



రాజంపేటలో డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, చిత్రంలో జగన్‌మోహన్‌రాజు తదితరులు

రాజంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజంపేటలో డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ భావన, టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు, జనసేన నేత శ్రీనివాసరాజు, మార్కెట్‌యార్డు చైర్మన్ గన్నే సుబ్బనరసయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1973లో ప్రారంభమైన పంచాయతీరాజ్ వ్యవస్థ గ్రామాల అభివృద్ధికి ఎంతో కీలకపాత్ర పోషించిందన్నారు. ఇందులో ఎంపీడీవోల పాత్ర కీలకమన్నారు. నేడు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాల ఏర్పాటుతో పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాల ఏర్పాటుతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో డీపీవో రాధమ్మ, తహసీల్దారు పీర్‌మున్నీ, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రాకెట్ కేసులో గ్లోబల్ ఆసుపత్రి సీజ్
కోర్టులో లొంగిపోయిన నిందితుడు డాక్టర్ పార్థసారథి 6

మద్యం మత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి... 6

పట్టాలపై మద్యం తాగుతుండగా రైలు దూసుకెళ్లి ఇద్దరు మృతి 6

నిండుకుండలా చిన్నపోతుల ప్రాజెక్టు
మొరవ దెబ్బతినడంతో వృథాగా పోతున్న నీరు 6

ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

- డీఆర్ వెంకట్రమణమూర్తి



స్టాంప్ రైటర్లను హెచ్చరిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ వెంకట్రమణ మూర్తి

బి.కొత్తకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలను ఇబ్బంది పెట్టే పనులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చేయకూడదని, రెవెన్యూ పెంచాలనే కారణంగా అడ్డదారులు తొక్కితే ఎలా అంటూ జిల్లా రిజిస్ట్రార్ వెంకట్రమణమూర్తి బి.కొత్తకోట కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించారు. ఈ కార్యాలయంలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని వెళ్లిన ఫిర్యాదులతో ఆ శాఖ కడప డీఐజీ రామలక్ష్మీ పట్నాయక్ నవంబరు 23న బి.కొత్తకోటకు చేరుకుని విచారణ చేపట్టారు. ఆ ఆరోపణలన్నీ నిజమేనని పలువురు బాధితులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని లిఖిత పూర్వక ఫిర్యాదులిచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా రిజిస్ట్రార్ గురువారం బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి సబ్ రిజిస్ట్రార్, స్టాంప్ వెండర్లు, రైటర్లు, రైతులతో మాట్లాడారు. రిజిస్ట్రేషన్లపై కొర్రీలు పెట్టి డబ్బు అదనంగా వసూలు చేసినట్లు రుజువు అయితే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చేవారు స్టాంప్ రైటర్లను ఆశ్రయించకుండా తామే స్టాంపులను కొని వివరాలు రాసుకుని స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని దీనిపై అవగాహన, చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. అక్రమాలు ఇకపై కూడా కొనసాగుతున్నట్లు భావిస్తే ఎవరైనా తమకు ఫిర్యాదు చేయవచ్చని రైతులు, ప్రజలకు సూచించారు.

మగ్గులు.. బకెట్ల బడి...!

- ఆ పాఠశాలలో వర్షం వస్తే అంతే మరి...
- పెచ్చులూడుతున్న పైకప్పు
- ఇదీ గాలివీడులోని ఆవులశెట్టివారిపల్లె పాఠశాల దుస్థితి



వర్షం నీటితో తడుస్తుండటంతో తరగతి గదిలో పెట్టిన బకెట్లు, మగ్గులు



పెచ్చులూడిన పైకప్పు



తడవకుండా బెంచి కింద పెట్టిన బ్యాగులు

గాలివీడు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అది విద్యార్థుల బడి కాదు.. మగ్గులు.. బకెట్ల బడిలా మారిపోయింది. చిన్నపాటి వర్షం పడినా తరగతిలో కురుస్తున్న నీటిని ఒడిసిపట్టేందుకు ఇలా బకెట్లు.. మగ్గులు పెడుతుంటారు. ఇక బ్యాగులు అయితే వర్షం నీటికి తడవకుండా బెంచీ కింద పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తరగతి గది పైకప్పు పెచ్చులు ఎప్పుడు ఊడిపడతాయో... ఇలాంటి పరిస్థితుల మధ్య విద్యార్థులు చదువు సాగిస్తున్నారు. ఇది గాలివీడు మండలంలోని ఆవులశెట్టివారిపల్లె మోడల్ ప్రైమరీ పాఠశాల దుస్థితి. కొద్దిపాటి వర్షం పడినా మొత్తం తరగతి గది, వరండా పూర్తిగా తడిసి ముద్దవుతోంది. పైకప్పు పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు కూర్చోవడం సైతం కష్టతరంగా మారి బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవలే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాఠశాల భవనాన్ని తనిఖీ చేసి పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని, ఎప్పుడైనా కూలిపోయే పరిస్థితిలో ఉందని ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు మోడల్ ప్రైమరీ పాఠశాలగా నడుస్తున్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 48 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే అందరికీ కలిపి ఒకే తరగతి గది ఉండటం, పైకప్పు పెచ్చులూడుతుండటంతో బోధనకు ఆటంకం ఏర్పడుతోందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నప్పటికీ మౌలిక వసతుల లేమితో పాఠశాల కార్యకలాపాలు అంతరాయానికి గురవుతున్నాయి.

పాఠశాల పైకప్పు ఆందోళన కలిగిస్తోంది



పాఠశాల పైకప్పు పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందో అని ఆందోళన కలిగిస్తోంది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు తరగతి గది, వరండా పూర్తిగా తడిసిపోతోంది. పైకప్పు పెచ్చులూడి అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ రోజులు గడపాల్సిన పరిస్థితి నెలకొంది. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

- వెంకట్రామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

అక్రమ క్వారీపై గనుల శాఖ కన్నెర్ర

- గిరిధర్‌రెడ్డిపై కేసు నమోదు



క్వారీని పరిశీలిస్తున్న సీఐ గోపాల్‌రెడ్డి తదితరులు



అక్రమణలపై సర్వే చేస్తున్న గనుల శాఖాధికారులు

బి.కొత్తకోట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సరైన అనుమతులు లేకుండానే అధికారం అడ్డం పెట్టుకుని బావ అండతో అక్రమంగా క్వారీ ఏర్పాటు చేసిన దాసరిపల్లి జయచంద్రారెడ్డి బావమరిది మంత్రి గిరిధర్‌రెడ్డిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. బి.కొత్తకోట మండలం తుమ్మణంగుట్ట పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు-111లో ఉన్న 82 ఎకరాలపైకి 5 ఎకరాలు తమకు క్వారీ నిర్వహణ కోసం కావాలంటూ గిరిధర్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. దీనికి అనుమతులు రాకమునుపే 10 ఎకరాల వరకు భూమిని ఆక్రమించి క్రషర్లను, గెస్ట్‌హౌస్‌ను నిర్మించారు. విద్యుత్ శాఖాధికారులు సైతం ట్రాన్స్‌ఫార్మర్‌లు అమర్చారు. దర్జాగా క్రషింగ్ చేసి టన్నుల కొద్దీ అమ్మకాలూ చేసేశారు. తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న జయచంద్రారెడ్డి గిరిధర్‌రెడ్డికి స్వయానా బావ కావడంతో ఏ అనుమతులున్నా, లేకపోయినా పనికానిచ్చేశారు. ములకలచెరువులో అక్రమ మద్యం కేసులో వీరిద్దరికీ సంబంధం ఉన్నట్లు తేలడంతో ఎక్సైజ్ అధికారులు జయచంద్రారెడ్డి, గిరిధర్‌రెడ్డిని కేసులో చేర్చారు. దీంతో టీడీపీ అధిష్ఠానం జయచంద్రారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. దీంతో ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. అక్రమంగా క్వారీ నిర్వహణపై ఫిర్యాదులతో అప్పట్లో గనుల శాఖ, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు తుమ్మణంగుట్ట వద్దకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అనుమతులు లేకుండానే అక్రమంగా క్వారీ ఏర్పాటైందని నిర్ధారిస్తూ సీజ్ చేశారు. అనుమతులు లేకనే తవ్వకాలు, క్రషింగ్ చేపట్టిన గిరిధర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ మైన్స్ అండ్ జియాలజీ ఏడీ డీవీ రంగకుమార్ మదనపల్లి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో కేసు వేశారు. దీనిపై విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకోవాలంటూ కోర్టు బి.కొత్తకోట పోలీసులను ఆదేశించింది. దీంతో గురువారం సీఐ గోపాల్‌రెడ్డి మరోసారి తుమ్మణంగుట్ట వద్దకు వెళ్లి సీజ్ చేసిన క్వారీని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కోర్టు ఆదేశాల మేరకు గిరిధర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఏ18గా ఉంటూ పరారీలో ఉన్న గిరిధర్‌రెడ్డిపై మరో కేసు నమోదు కావడం చర్చనీయాంశమైంది.

రాయచోటిలో భారీ ర్యాలీ

- జిల్లా కేంద్రంగా రాయచోటి కొనసాగింపు
- మంత్రి మండిపల్లి ఆధ్వర్యంలో కృతజ్ఞతాభివందన ర్యాలీ



భారీ జన సమూహం మధ్య ర్యాలీలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాయచోటి కేంద్రంగానే అన్నమయ్య జిల్లా కొనసాగింపుపై సీఎం చంద్రబాబునాయుడు రాయచోటి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం రాయచోటిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో థాంక్యూ సీఎం సార్.. అంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా సాధన జేఏసీ నాయకులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, ప్రజలతో అడుగడుగునా ఆనందోత్సాహాలతో కృతజ్ఞతాభివందన ర్యాలీ రాయచోటి చెక్‌పోస్టు శివాలయం నుంచి రాయచోటి జూనియర్ కాలేజ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞతాభినందన సభలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌ల సహకారంతో అన్నమయ్య జిల్లాను అన్ని జిల్లలకు దీటుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఏ రాజకీయ పార్టీ నిర్వహించలేని విధంగా ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ ముందుకు వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞత తెలుపుతూ సభ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా జేఏసీ సభ్యులు మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. రాయచోటి కేంద్రంగా అన్నమయ్య జిల్లా సాధన కోసం కృషి చేసిన నాయకుడిని ఎప్పుడు మర్చిపోకూడదని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగిరెడ్డి, జనార్దన్ రెడ్డి, రాయచోటి మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి, బోనమల ఖాదర్‌వలి, రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర నాయుడు, కోటేశ్వర్‌రెడ్డి, గాజుల ఖాదర్ బాషా, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తుల కోసం వేధిస్తున్నారు

- కోడలు, మనవరాళ్లతో ప్రాణహాని
- రక్షణ కల్పించాలని వృద్ధ దంపతుల వేడుకోలు



మాట్లాడుతున్న వృద్ధ దంపతులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాము కష్టపడి సంపాదించిన ఆస్తుల కోసం కోడలు, మనవరాళ్లు వేధిస్తున్నారని వృద్ధ దంపతులు చిన్నప్ప, గోపమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కుమార్తె కమలతో కలిసి వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కురబలకోట మండలం తెట్టు గ్రామం, గుంతపల్లె వంకకు చెందిన తాను కరెంటు ఆఫీసులో అటెండర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చెందానన్నారు. తమకు సుధాకర్, సురేష్‌కుమార్, కవల పిల్లలని వీరిలో సుధాకర్ వివాహం కాకనే చనిపోగా, రెండో కుమారుడు సురేష్ కుమార్ ఏడాది కింద చనిపోయాడని తెలిపారు. కుమార్తె కమల పట్టణంలోని కనకదాస్ నగర్‌లో ఉంటోంది. కాగా సురేష్‌కు పుట్టిన ముగ్గురు ఆడపిల్లలకు పెన్షన్‌తోనే చదివించి ఆలనా పాలనా చూశామని కొడుకు చనిపోగానే కోడలు మంజుల, మనవరాళ్లు మానస, పావని, నవ్యశ్రీ తమ ఆస్తి కోసం పాకులాడుతున్నారని ఆరోపిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. తాము కొన్నేళ్లుగా నీరుగట్టువారిపల్లె, మాయాబజారులో సొంత ఇంట్లో ఉండేవారమని గొడంలు పెట్టుకుని గెంటేయడంతో స్వగ్రామం గుంతలవంకకు వెళ్లామన్నారు. రెండు రోజుల క్రితం కోడలు, మనవరాళ్లు వచ్చి పొలాలు, ఇళ్లు రాసి ఇవ్వాలని బెదిరించారని ఆరోపించారు. సొంత ఊళ్లో దాయాదుల భూమి భాగ పరిష్కారం కాలేదని, కనకదాస్ నగర్‌లో ఉండే ఇంటికి ఆక్రమించుకుని కోడలు బాడుగకు ఇచ్చిందని ఆ ఇల్లు తమకు ఇప్పించాలని వేడుకున్నారు. వేధింపులకు గురి చేస్తే పల్లె వద్ద ఉన్న ఎనిమిదెకరాల పొలం, ఇల్లు అనాథ శరణాలయానికి రాసి ఇచ్చేసి మేము కూడా అక్కడికే వెళ్లిపోతామన్నారు. అధికారులు స్పందించి మాకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

రాచవేటివారిపల్లిలో దొంగల హల్‌చల్

- డబ్బు, నగలు చోరీ


చిందరవందరగా వేసిన బీరువాలోని వస్తువులు

నిమ్మనపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాచవేటివారిపల్లి పంచాయతీ గారబురుజులో బుధవారం రాత్రి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి నగదు, బంగారాన్ని దోచుకెళ్లినట్లు ఇంటి యజమాని మంచూరి వేణుగోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ రవినాయక్, ఎస్ఐ తిప్పేస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ వేణుగోపాల్‌రెడ్డితో ఆయన భార్య కళావతి వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. వీరికి రెండు ఇళ్లు వుండగా ఒక ఇంట్లో నిద్రిస్తూ మరో ఇంటికి తాళాలు వేసేవారు. బుధవారం రాత్రి 11 గంటల వరకు మేల్కొని వుండి అనంతరం ఒక ఇంటికి తాళం వేసి మరో ఇంట్లో పడుకున్నారు. ఇదే అదునుగా భావించి దొంగలు రాత్రి 12 గంటల పైన తాళం వేసిన ఇంటి తాళాలు తెరిసి బీరువా తాళానికి పెట్రోల్ పోసి నిప్పుపెట్టి అందులో ఉన్న 10 గ్రాముల బంగారం, రూ.95 వేల నగదు దోచుకెళ్లారు. గురువారం ఉదయం వేణుగోపాల్‌రెడ్డి నిద్ర లేచి చూడగా అప్పటికే ఇంటి తాళం తీసి ఉండడంతో ఇంట్లోని బంగారం, డబ్బు లేకపోవడంతో వెంటనే పోలీసులకు విషయాన్ని తెలుపగా వారు క్లూస్ టీంతో వచ్చి ఇంటి పరిసరాలను తనిఖీ చేసి చుట్టుపక్కల వారిని విచారించారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి వచ్చి వుంటారని అనుమానిస్తున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

డీడీవోలతో మరింత బలోపేతం


డీడీవో కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో చేపట్టిన డివిజనల్ అభివృద్ధి అధికారులతో పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. గురువారం మదనపల్లె డీడీవో కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే పంచాయతీరాజ్ ఉద్యోగులకు ఒక గౌరవం తీసుకొచ్చిన ఘనత డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కే చెందుతుందన్నారు. ఆయన నమ్మకానికి అనుగుణంగా పంచాయతీరాజ్ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్టపడి పనిచేయాలన్నారు. ముఖ్యంగా పంచాయతీ సెక్రటరీలు పనితీరు మెరుగుపరుచుకుంటూ, ప్రజలకు సేవలందించాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచుల భాగస్వామ్యంతో పాలన అందించాలే కాని సర్పంచులు చెప్పిందల్లా చేయకూడదని హితవు పలికారు. డీఎల్‌పీవో నాగరాజు మాట్లాడుతూ డీడీవో పర్యవేక్షణలో డివిజన్ అభివృద్ధికి అందరం కలసికట్టుగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో 11 మండలాల ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నవీన్‌చౌదరి, టీడీపీ నేతలు ఆర్‌జే వెంకటేశ్, జేవీ రమణ, పెంచుపాడు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నిండుకుండలా చిన్నపోతుల ప్రాజెక్టు

- మొరవ దెబ్బతినడంతో వృథాగా పోతున్న నీరు
- మరమ్మతులు చేస్తే రెండు వేల ఎకరాలకు సాగునీరు
- ఏళ్ల తరబడి పట్టించుకోని పాలకులు


నీటితో కళకళలాడుతున్న చిన్నపోతుల ప్రాజెక్టు


దెబ్బతిన్న ప్రాజెక్టు మొరవ

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరువు సీమలో నీటి నిల్వ చేసి సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు భూములకు నీరందించే లక్ష్యంతో 1990లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో చిన్నపోతుల ప్రాజెక్టు నిర్మించారు. ఈ ప్రాజెక్టు వల్ల లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు సాగునీరు అందుతుంది. అయితే ప్రాజెక్టు నిర్మించినప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. ఈ ప్రాజెక్టు కుడి,


పిచ్చిమొక్కలతో నిండిపోయిన కుడి కాలువ

ఎడమ కాలువల ద్వారా కోనంపేట, బి.యర్రగుడి మామిడిగారిపల్లె, పాలెంగొల్లపల్లె, చెంచర్లపల్లి, నల్లగుట్టపల్లి గ్రామాల్లోని పొలాలకు నీరు చేరేవి. అలాంటి కాలువలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎడమ కాలువ పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుకుంది. ప్రాజెక్టు నిండితే మొరవ ద్వారా నీరు వెళ్లి రామరాజు వంకకు చేరుకుని రామాపురం మండలంలోని అన్ని చెరువులకు నీరు చేరుతుంది. ఇలాంటి పెద్ద ప్రాజెక్టుకు ఇంతవరకు మరమ్మతులు చేయలేదు. దీనికి తోడు గండికోట నుంచి చక్రాయపేట మండలం కాలేటివాగు నుంచి చిన్నపోతుల ప్రాజెక్టుకు పైపులైన్ ద్వారా నీరు అందించేందుకు గతంలో అధికారులు అంచనాలు వేసి పనులు కూడా ప్రారంభించారు. అయితే ఆ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. శేషాచలం అడవుల్లో కురిసిన వర్షపునీరు చిన్నపోతుల ప్రాజెక్టుకు చేరుకుంటుంది. మొరవ దెబ్బతినడంతో కుడి, ఎడమ కాలువలు తెగిపోయాయి. మొరవ కొట్టుకుపోయి పోవడంతో నీరంతా వృథాగా పోతోంది. ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తే వేసవిలో కూడా ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంటుంది. చుట్టూ ఉన్న గ్రామాల్లోని బోర్లకు నీరు తగ్గకుండా ఉంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రాజెక్టు కల్వర్టుతో పాటు కుడి, ఎడమ కాలువలు కాలువలు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



చిన్నపోతులపల్లి ప్రాజెక్టు మొరవ, కుడి, ఎడమ కాలువలకు మరమ్మతులు చేస్తే ఎండాకాలంలో కూడా ఉంటాయి. మూడుకార్ల పంటలు పండించుకోవచ్చు. అధికారులు స్పందించి కల్వర్టు కుడి, ఎడమ కాలువలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

- వెంకట్రమణ, చిన్నపోతులపల్లి

ఎవరూ పట్టించుకోలేదు



1990లో నిర్మించిన చిన్నపోతుల ప్రాజెక్టుకు ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదు. అధికారులకు తెలిపినా ఎవ్వరూ పట్టించుకోలేదు. వచ్చిన నీరంతా వృథాగా పోతోంది. కనీసం 100 ఎకరాలకు కూడా సక్రమంగా నీరు అందడం లేదు.

- వేణుగోపాల్, చిన్నపోతులపల్లి ప్రాజెక్టు చైర్మన్

విద్యాభివృద్ధిలో యూటీఎఫ్ పాత్ర కీలకం : డీఈవో


పదో తరగతి మోడల్ పేపర్స్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిలో యూటీఎఫ్ పాత్ర కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని డీఈవో కార్యాలయంలో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ రూపొందించిన పదో తరగతి మోడల్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ కేవలం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధిలో కూడా కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు నిరంతరం పాటు పడుతుందని, హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించిన సంఘంగా యూటీఎఫ్ రాణిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యార్థుల క్షేమం గురించి ఆలోచించడం ఒక్క యూటీఎఫ్‌కు మాత్రమే సాధ్యమన్నారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబీర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది నిష్ణాతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులచే మోడల్ ప్రశ్నాపత్రాలను రూపొందించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మోడల్ పేపర్స్ కావాల్సినవారు 9440181800, 9849534690 నెంబర్లతో పాటు ఆయా ప్రాంతాల్లోని యూటీఎఫ్ నాయకత్వాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి, జిల్లా కార్యదర్శి దావూద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రరెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, అమీన్, రఫీక్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, ఇమ్రాన్, రాజారమేశ్, రియాజ్, బసయ్య తదితరులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన వద్దు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ఆందోళన అవసరం లేదని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రస్తుతం మన జిల్లా పరిధిలో ఇప్పటికే 289 నమూనాలు సేకరించామని ఇందులో కేవలం 39 పాజిటివ్ కేసులు మాత్రమే వచ్చాయన్నారు. ఈ వ్యాధి తీవ్రమైనది కాదని, ఇందుకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందన్నారు. బ్యాక్టీరియా కుట్టిన చోట నలుపు రంగులోకి మారి మచ్చగా ఏర్పడుతుందని, దీనివల్ల అధిక జ్వరం, తలనొప్పి, అధిక నొప్పులు, వైరల్ జ్వరంగా మారే అవకాశాలు ఎక్కువ కావున మూడు రోజులుగా పైబడి ఉంటే సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లి సకాలంలో చికిత్స తీసుకుంటే వ్యాధి నయం అవుతుందన్నారు. వైద్య సిబ్బంది ప్రతి గ్రామంలో పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

జాతీయ జంబోరీలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి

రాయచోటిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లక్నోలో గత నెల 22 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జాతీయ జంబోరీలో పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపిన జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లు, విద్యార్థులను గురువారం మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, డీఈవో సుబ్రమణ్యం అభినందించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ జాతీయ జంబోరీలో నేపాల్, శ్రీలంక, సౌదీ అరేబియా దేశాలతో పాటు దేశవ్యాప్తంగా దాదాపు 35 వేల మంది పాల్గొనగా జిల్లా నుంచి 62 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఇందులో జిల్లా విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్లు సాధించినట్లు తెలిపారు. గురువారం జిల్లాకు చేరుకున్న విద్యార్థులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, డీఈవో సుబ్రమణ్యం ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

వాల్మీకిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆరమడక గ్రామానికి చెందిన శ్రీనాథ్ (38) స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో వెళ్తూ మార్గమధ్యలో కూరపర్తి గ్రామం వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు.

తీవ్రంగా గాయపడిన శ్రీనాథ్‌ను గ్రామస్తులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం తెలియజేశారు.

మద్యం మత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి...



వాల్మీకిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు ట్రాన్స్‌ఫార్మర్‌పై కూర్చుని హల్‌చల్ చేసిన సంఘటన గురువారం వాల్మీకిపురం మండలంలోని తాటిగుంటపల్లె గ్రామ పంచాయతీలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పంచాయతీ పరిధిలోని గజ్జలవారి పల్లెలో విద్యుత్ స్తంభాలకు ఉన్న వీధి లైట్లను, విద్యుత్ లైన్లు మార్చే దిశగా ట్రాన్స్‌కో సిబ్బంది పనులు చేపట్టారు. అయితే వీధిలైట్లకు సంబంధించిన వస్తువులను తీసుకెళ్లాడని నాగార్జున అనే యువకుడిని పంచాయతీ సెక్రటరీ ప్రశ్నించాడు. మద్యం మత్తులో ఉన్న నాగార్జున తననే అనుమానించి ప్రశ్నిస్తావా అంటూ సెక్రటరీని బెదిరించి ఆపై విద్యుత్ స్తంభం ఎక్కి ట్రాన్స్‌ఫార్మర్‌పై గొడుగు పట్టుకుని కూర్చోవడమే కాక బిగ్గరగా కేకలు వేస్తూ ట్రాన్స్‌కో సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేశాడు. ఆ సమయానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయాన్ని గమనించిన గ్రామస్థులు ఎంత చెప్పినా యువకుడు వినకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న నాగార్జునను కిందికి దింపి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాలపై మద్యం తాగుతుండగా రైలు దూసుకెళ్లి ఇద్దరు మృతి


వీరభద్రయ్య, మునికుమార్ (ఫైల్)

కలికిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టాలపై మద్యం తాగుతుండగా ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన కలికిరి రైల్వేస్టేషను వద్ద బుధవారం రాత్రి జరిగింది. కదిరి రైల్వే పోలీసు ఎస్ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. గుట్టపాళెం గ్రామం ఆచార్ల కొత్తపల్లెకు చెందిన జి.వీరభద్రయ్య (49) కలికిరి పట్టణంలోని పోలీసుస్టేషన్ రోడ్డులో కాపురముంటున్నాడు. ఇతను ఇళ్ల బాడుగలతో జీవనం సాగిస్తున్నాడు. సోమల మండలం ఇరికిపెంటకు చెందిన మునికుమార్ (27) కలికిరిలోని ఏఎన్ఆర్ కాలనీలో నివాసముంటూ దోబీ పని చేస్తున్నాడు. ఇద్దరూ స్నేహితులు. బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇద్దరూ కలిసి మద్యం తాగేందుకు రైల్వే స్టేషను వద్దకెళ్లారు. అక్కడున్న సెక్యూరిటీ అడ్డు చెప్పడంతో స్టేషను తూర్పు వైపు వచ్చి పట్టాల మధ్యలో కూచుని మద్యం తాగుతుండగా అదే సమయంలో ముంబాయి-నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ వేగంగా వెళ్లింది. పట్టాల మధ్యలో ఉన్న ఇద్దరూ తునాతునకలయ్యారు. రైలు లోకోపైలట్ జగదీశ్ దీనిని గమనించి సీటీఎం రైల్వేస్టేషన్‌లో సమాచారం ఇచ్చాడు. ఆ వెంటనే వారిచ్చిన సమాచారంతో కదిరి రైల్వే పోలీసులు కలికిరి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని విచారణ ప్రారంభించారు. మృతుల తండ్రులు లింగయ్య, చంద్రయ్య వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఆత్మహత్య సంఘటనగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. మృతుడు వీరభద్రయ్యకు ఇద్దరు ఇంజినీరింగ్ చదువుతున్న పిల్లలున్నారు. మునికుమార్‌కు రెండేళ్ల కుమారుడున్నాడు. మృతదేహాలకు శవపరీక్షలు పూర్తి చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా వీరిద్దరూ మద్యానికి బానిసలయ్యారని స్థానికులు చెబుతున్నారు. సంఘటనకు ముందు కూడా మునికుమార్ భార్య శ్రీదేవి రైల్వేస్టేషను వద్దకు వెళ్లి భర్తను ఇంటికి రావాలని ప్రాధేయ పడినట్లు సమాచారం.

కిడ్నీ రాకెట్ కేసులో గ్లోబల్ ఆసుపత్రి సీజ్


గ్లోబల్ ఆస్పత్రి వద్ద డీఎస్పీ మహేంద్ర, తదితరులు

మదనపల్లె/మదనపల్లె అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కిడ్నీ మార్పిడి కేసులో పోలీసులు గురువారం ఎస్‌బీఐ కాలనీలోని గ్లోబల్ ఆసుపత్రిలో సోదాలు చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రితోని ఆపరేషన్ థియేటర్, ఆపరేషన్‌కు ఉపయోగించిన పరికరాలు, మందులను స్వాధీనం చేసుకుని ఆసుపత్రితో సహా సీజ్ చేసినట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. గత నెల 9వ తేదీ జరిగిన ఈ సంఘటనలో ఆసుపత్రి అధినేత, అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఎస్ కె.ఆంజనేయులుతో పాటు మరో ఏడుగురిని అరెస్టు చేశారు.

అనంతరం ఆంజనేయులును సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో ప్రధానపాత్ర పోషించిన డాక్టర్ ఆంజనేయులుతో పాటు మదనపల్లె డయాలసిస్ కేంద్రంలో పనిచేస్తున్న మేనేజరు బాలరంగడు, కదిరి డయాలసిస్ కేంద్ర మేనేజరు మెహరాజ్, విశాఖకు చెందిన పిల్లి పద్మ, కాకర్ల సత్య, సూరిబాబు, కిడ్నీ మార్పిడి చేసిన బెంగళూరుకు చెందిన డాక్టర్ పార్థసారధిరెడ్డికి సహకరించిన కడపకు చెందిన అనుచరులు కొండయ్య, సుమన్‌లను రెండు విడతలుగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఇదే కేసులో మరో ఆరుగురిపై కేసు నమోదైంది. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలావుండగా, గురువారం జరిగిన ప్రక్రియలో డీఎస్పీతో పాటు వన్, టూటౌన్ సీఐలు ఎస్.మహ్మద్‌రఫీ, రాజారెడ్డి, ఎస్ఐ రహీముల్లా, మదనపల్లె పీపీ యూనిట్ వైద్యులు డాక్టర్ శ్రీధర్, ప్రభాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయులే ప్రధాన నిందితుడు

జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్తగా ఉంటూ మానవఅవయవాల అక్రమ మార్పిడిలో ఆంజనేయులు ప్రధాన నిందితుడని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా వైద్యులైన ఆయన కుమారుడు డాక్టర్ అవినాశ్, కోడలు శాశ్వతిపై కూడా కేసు నమోదైనట్లు తెలిసింది. అలాగే గ్లోబల్ ఆసుపత్రి రిజిస్ట్రేషన్ అయిన ఆంజనేయులు భార్యపై కూడా కేసు నమోదు చేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆసుపత్రి ఎవరి పేరుపై ఉందో ఆ వివరాలు ఇవ్వాలని పోలీసులు ఇప్పటికే వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను కోరారు. అధికారిక సమాచారం వచ్చాక ఆసుపత్రి రిజిస్ట్రేషన్ అయిన వారిపై కూడా కేసు నమోదు చేయనున్నారు. ఇదిలా వుండగా సంఘటన జరిగిన 9వ తేదీ ఆసుపత్రి నుంచి సీసీ పుటేజీ, హార్డ్‌డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఎస్ఎఫ్ఎల్ రిపోర్టుకు పంపించగా ఇటీవల నివేదిక వచ్చినట్లు తెలిసింది. ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి ఎన్ని రోజులుగా జరుగుతోంది. ఎంత మందికి చేశారు. అందులోని కిడ్నీ దాత, రిసీవర్‌లు ఎవరు? శస్త్రచికిత్సలు చేసిందెవరన్నది స్పష్టమైనట్లు తెలిసింది. ఇందులో భాగంగా విశాఖపట్నానికి చెందిన యమున (29)కు జరిగిన కిడ్నీ మార్పిడి కంటే ముందు మరొకరికి కూడా చేశారు. ఇందులో ఇద్దరు రిసీవర్‌లు, ఒక డోనర్ బెంగళూరు ఆసుపత్రులలో కోలుకుంటుండగా, యమున మాత్రం అదేరోజు ఇక్కడి ఆసుపత్రిలో మృతి చెందడంతో కిడ్నీ రాకెట్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

కోర్టులో లొంగిపోయిన డాక్టర్ పార్థసారథి



కిడ్నీ రాకెట్ కేసులో ఏ-2 డాక్టర్ పార్థసారథి గురువారం రాత్రి మదనపల్లె సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ కోర్టు న్యాయాధికారి ముందు లొంగిపోయాడు. దీంతో నిందితుడికి రిమాండ్ విధించారు. పులివెందులకు చెందిన డాక్టర్ పార్థసారథి బెంగళూరులో ఉంటున్నాడు. కిడ్నీ మార్పిడి కేసులో నిందితుడిగా ఉన్న ఇతను పరారీలో ఉన్నాడు. పోలీసులు ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో నిందితుడే స్వయంగా కోర్టులో లొంగిపోయాడు. వైద్య పరీక్షల అనంతరం మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు.

బీపీఎస్, ఎల్‌వోఎస్ పథకాలకు అనుమతి

- రీజనల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సంజీవకుమారన్



అధికారులకు సూచనలు ఇస్తున్న రీజనల్ డైరెక్టర్

మదనపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర, పట్టణాల్లోని ప్రజలకు ప్రభుత్వం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్), ల్యాండ్ కన్వర్షన్ స్కీమ్ (ఎల్‌వోఎస్) పథకాలకు అనుమతి ఇచ్చిందని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్, టౌన్, కంట్రీ ప్లానింగ్ (అనంతపురం) అధికారి సంజీవకుమారన్ తెలిపారు. వీటిపై పట్టణాల్లో వినియోగదారులకు అవగాహన, చైతన్యం కల్గిస్తూ వీలైనంతమంది సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆర్డీ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మదనపల్లె, రాయచోటి, పుంగనూరు మున్సిపాలిటీలు సహా బి.కొత్తకోట నగర పంచాయతీ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఆర్డీ మాట్లాడుతూ 1985 నుంచి 2025 వరకు నిర్మించిన అన్ని భవనాలకూ బీపీఎస్ పథకం వర్తిస్తుందన్నారు. అనుమతి కన్నా అదనంగా, అక్రమంగా నిర్మించిన ఫ్లోర్లు, ఇతర నిర్మాణాలను సక్రమం చేసుకునేందుకు ఇదొక సువర్ణావకాశమన్నారు. సెట్ బ్యాక్, ఓపెన్‌సైట్‌లకు కూ డా వర్తిస్తుందన్నారు. రెసిడెన్షియల్, కమర్షియల్ విభాగాలకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుం చెల్లించాలని, ఏదైనా నిర్మాణానికి అసెస్‌మెంట్, డోర్ నెంబర్‌తో పనిలేకున్నా, వేకెన్సీ ల్యాండ్ ట్యాక్సు (వీఎల్‌టీ) ప్రాతిపాదికన దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు. ఎల్ఆర్ఎస్ పథకాన్ని కూడా ప్రభుత్వం వచ్చే ఏడాది జనవరి 23వ తేదీ వరకు పొడిగించిందని ఆర్డీ ప్రకటించారు. ఇదివరకే ఉన్న ల్యాండ్ కన్వర్షన్, లేఅవుట్ చార్జీలను 14 శాతం నుంచి ఏడు శాతానికి ప్రభుత్వం తగ్గించిందని, నిర్ణీత గడువులోగా ఆ లేఅవుట్‌లో ఏదో ఒక ప్లాటు రిజిస్ట్రేషన్ అయి ఉంటే అర్హతగా తీసుకుంటామని ఆర్డీ వివరించారు. సమావేశంలో మదనపల్లె మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, టౌన్‌ప్లానింగ్ అధికారి చిన్నరెడ్డెమ్మ, రాయచోటి, పుంగనూరు, బి.కొత్తకోట పట్టణ ప్రణాళిక అధికారులు, వార్డు ప్లానర్స్ ప్రైవేటు లైసెన్స్ ప్లానర్లు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుడి ప్రతిభ



కామిశెట్టి వెంకట్

ప్రొద్దుటూరుటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల్లో పట్టణానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు కామిశెట్టి వెంకట్ ప్రతిభ కనపరిచారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల్లో శ్లోకాలు, పాటలు పడి ఆకట్టుకున్నాడు. అలాగే నృత్యం, సినిమా డైలాగ్‌లు, లిప్‌రీడింగ్, కర్ణాటక సంగీత గీతాలాపన, పేరడీ పాటలతో అలరించాడు. ఒకే వ్యక్తి విభిన్న కళలను ప్రదర్శించడంతో ఆహూతులు కామిశెట్టి వెంకట్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కామిశెట్టి వెంకట్ తల్లి విశాలాక్షి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే ఉత్సవాల్లో విభిన్న ప్రతిభావంతులకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించాలని కోరారు.

చివరి మజిలీకి... ఎన్ని తిప్పలో!

- శ్మశానవాటికకు రహదారి లేక నానా అవస్థలు





బురదలో చేతులపై పాడె తీసుకెళుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికకు సరైన దారి లేక ఆఖరి మజిలి ఓ పరీక్షగా మారింది. బురద నేలలో, ముళ్లపొదల్లో మృతదేహాన్ని భుజాలపైన మోసుకెళ్లేందుకు వీలు లేక చివరకు చేతుల మీదుగా తీసుకెళ్లాల్సి దుస్థితి. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీలోనున్న లింగాపురం గ్రామంలో సుమారు రెండు వేల మంది జనాబా ఉన్నారు. ఇక్కడి వారికి శ్మశాన వాటికకు వెళ్లేందుకు సరైన దారి లేక నిత్యం అవస్థలు పడుతున్నారు. గురువారం ఓబన్న అనే వ్యక్తి గుండె సమస్యతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాన్ని శ్మశానవాటిక తీసుకువెళ్లేందుకు అతని కుటుంబ సభ్యులు నానా తిప్పలు పడ్డారు. వర్షం ధాటికి బురద నేలలో నడిచేందుకు వీలు లేక ముళ్లపొదల్లో అవస్థలు పడ్డారు. మృతదేహాన్ని భుజాలపై ఎత్తుకెళ్లేందుకు కూడా వీలులేక చేతులతో పట్టుకెళ్లారు. ఇక శ్మశాన వాటిక ఇప్పటికే ఆక్రమణకు గురికావడంతో ఉన్న కొద్దిపాటి స్థలంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. కూర్చునేందుకు అరుగులు, నీటి సౌకర్యం, కనీసం శ్మశాన వాటికకు సరైన దారి కూడా లేదని వాపోతున్నారు. ఈ సమస్యపై కొత్తపల్లె ఎంపీటీసీ సభ్యుడు గోపాల్‌తోపాటు ఇతర ప్రజాప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశంలో పలుమార్లు అధికారులకు సమస్యను విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఖరి మజిలీలో మృతదేహాలకు దక్కుతున్న గౌర వం ఇదేనా అని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

రైల్వే ఉద్యోగాలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గురుమూర్తిరెడ్డి

ప్రొద్దుటూరుటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 2021 సంవత్సరం పూర్వ విద్యార్థులు రైల్వేలో జూనియర్ ఇంజనీరు ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ గురుమూర్తిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అభినంద నందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల పూర్వవిద్యార్థులు మస్తాన్‌వలి, తులసి, మహమ్మద్‌గౌస్, చౌడయ్యలు జేఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపిక కళాశాల ప్రతిష్ఠను పెంచిందన్నారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జెనెటిక్స్ అండ్ జినోమిక్స్ ప్రతిభావంతులకు బంగారుపతకం



ఒప్పంద పత్రాలను అందిస్తున్న వీసీ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఎంఎస్సీ జెనెటిక్స్ అండ్ జినోమిక్స్ విభాగం ప్రతిభావంతుల కోసం బంగారు పతకం ఏర్పాటు చేసింది. ఇందుకోసం విభాగ అధ్యాపకులు రూ.1.25 లక్షలు విశ్వవిద్యాలయానికి అందించారు. వడ్డీతో ప్రతి సంవత్సరం అత్యుత్తమ ర్యాంక్ సాధించిన విద్యార్థికి స్నాతకోత్సవంలో బంగారు పతకం ప్రదానం చేయనున్నారు. ఈమేరకు అధ్యాపకులు డాక్టర్ ఎ.మునికుమారి, డాక్టర్ ఎల్.దాక్షాయణి, డాక్టర్ బి.రమేష్, డాక్టర్ పి.ఉస్మాన్ బాష, వీసీ ఆచార్య రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ పద్మ, పరీక్ష నియంత్రణ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావుతో ఒప్పందం పత్రాలపై సంతకాలు చేశారు. అధ్యాపకుల ఉదారతను వైస్ చాన్సలర్ అభినందించారు.


పిల్లల పట్ల ప్రేమగా వ్యవహరించండి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రమాదేవి

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కేంద్రంలోని పిల్లల పట్ల ప్రేమగా వ్యవహరించాలని సిబ్బందికి ఐసీడీఎస్ పీడీ రమాదేవి సూచించారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పిల్లలకు సంబంధించిన చట్టాలు, శిశు సంరక్షణ సంస్థల్లో కనీస సంరక్షణ ప్రమాణాలు, రక్షణ నిర్వహించడంపై చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ నిర్వాహకులకు, సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాల్లో తల్లిదండ్రులు కోల్పోయి కుటుంబ బాంధవ్యాలకు దూరమైన పిల్లలు ఎక్కువగా ఉంటారన్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బంది పిల్లల పట్ల ప్రేమగా ఆప్యాయతతో వ్యవహరిస్తే.. వారు మానసికంగా దగ్గరై వారి సమస్యలను మనతో పంచుకుంటారన్నారు. అనంతరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ హాస్పిటల్ కడప ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాలకు వచ్చే పిల్లల మానసిక పరిస్థితిని గుర్తించి వారికనుగుణంగా ప్రేమతో వ్యవహరిస్తే మార్పు తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవిప్రకాశ్‌రెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బీఆర్ సుభాష్‌యాదవ్, జిల్లా బాలల పరిమితుల విభాగం ప్రొటెక్షన్ ఆఫీసరు సునీత, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ప్యానెల్ అడ్వకేట్ శాంత, నోడల్ ఆఫీసరు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌లో ఉద్యోగ అవకాశాలు



అవగాహన కల్పిస్తున్న ఐబీఎం ప్రతినిధి జ్ఞాన్‌యల్లా

వేంపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ కంప్యూటింగ్‌పై విద్యార్థులు శిక్షణ పొందితే ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని ఐబీఎం కంపెనీ ప్రతినిధి జ్ఞాన్‌యల్లా తెలిపారు. గురువారం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఐదు రోజుల పాటు జరిగే శిక్షణ సమావేశంలో జ్ఞాన్‌యల్లా మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్‌లో కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్తులో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. ఆయా కోర్సుల గురించి విద్యార్థులకు, ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న అధ్యాపకులకు వివరంగా తెలియజేశారు. డైరెక్టర్ గుప్త, ఏఓ రవికుమార్, ట్రిపుల్‌ఐటీ అధికారులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు



నేత్రదానం చేస్తున్న చలపతి కుటుంబ సభ్యులు

కొండాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మృతి చెందిన వ్యక్తి కళ్లు దానం చేయడంతో ఇద్దరికి చూపు దక్కనుందని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. కొండాపురం పట్టణానికి చెందిన వెంకటాచలపతి (80) అనే వ్యక్తి గురువారం మృతి చెందాడు. ఆయన కుమారులు బాలాజీ, సంజీవ్‌లు తన తండ్రి కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. అనంతపురానికి చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యం లో కొండాపురంకు చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి హాజీవలి, డాక్టర్ కుళ్లాయిప్ప, టెక్నీషియన్లు రాఘవేంద్ర, విజయభాస్కర్‌రెడ్డి చలపతి నివాసం చేరుకుని ఆయన నేత్రాలను సేకరించారు. ఈ కళ్లను రెడ్‌క్రాస్ సొసైటీకి తరలించారు.

సీనియార్టీలో న్యాయం చేయాలి



ఏపీ జెన్‌కో ఎండీని కలిసిన ఆర్టీపీపీ భూనిర్వాసితులు

ఎర్రగుంట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీకి భూములు కోల్పోయి ఉద్యోగాలు పొందిన వారు సీనియార్టీ విషయంలో న్యాయం చేయాలని ఎండీ నాగలక్ష్మిని కోరారు. గురువారం సాయంత్రం విజయవాడలోని విద్యుత్ సౌధలో కలమల్ల, సున్నపురాళ్లపల్లె, ఇండ్లసిద్దాయపల్లె, ఇతర చుట్టుపక్కల గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఎండీతో పాటు హెచ్‌ఆర్ డైరక్టర్ ఉష, ఇతర అధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1988లో ఆర్టీపీపీ నిర్మాణానికి భూములిచ్చామన్నారు. 2011, 2013లో జీవో నెంబరు 98 ప్రకారం 50శాతం పోస్టులను ల్యాండ్ లూజర్లకు కేటాయించారన్నారు. మిగిలిన 50శాతం రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకాలు జరిగాయన్నారు. గత 12 సంవత్సరాలుగా భూనిర్వాసితులకు మొదటి ప్రాధాన్యతతో, అనంతరం రిక్రూట్‌మెంట్ ద్వారా వచ్చిన వారికి మెరిట్ ఆధారంగా సీనియారిటీ అమల్లో ఉందన్నారు. అయితే తాజాగా సీనియారిటి జాబితాను మార్పులకు గురిచేసి భూ నిర్వాసిత ఉద్యోగులను వెనక్కినెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ పేరుతో 12 సంవత్సరాల తర్వాత సీనియారిటిని తారుమారు చేయడం అన్యాయమన్నారు. భూములిచ్చిన వాళ్లమని, స్థానిక హక్కు సీనియారిటీ తమకే ఉందన్నారు. సీనియారిటీ పేరుతో తమ జీవితాలతో చెలగాటమాడవద్దన్నారు. తమకు అన్యాయం జరిగితే స్థానిక గ్రామాల ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామన్నారు.

జమ్మలమడుగులో డీడీవో కార్యాలయం ప్రారంభం



డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, పక్కన భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో గురువారం డివిజనల్ అభివృద్ధి కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రంలోని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల ద్వారా రాష్ట్ర అభివృద్ధి కోసం ఏర్పాట్లు చేయబోతున్న కార్యాలయాల ప్రారంభోత్సవ వర్చ్యువల్ కార్యక్రమం జరిగింది. అందులో భాగంగా జమ్మలమడుగు నియోజకవర్గంతో పాటు ప్రొద్దుటూరు, రాజుపాళెం, దువ్వూరు, చాపాడు, పది మం డలాలకు కలిపి జమ్మలమడుగులో డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయం ప్రారంభం కావడం సంతోషకరమని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, వైస్‌చైర్మన్ మల్లికార్జున, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు గౌస్ అహమ్మద్, ఎస్.షబ్బీర్, కె.రఫి, అందె జగన్‌మోహన్‌రెడ్డి, కిరణ్‌రాయల్, కర్నాటి రామాంజనేయరెడ్డి, డీఎల్‌పీవో నూర్జహాన్, ఎంపీడీవో సైదున్నీసా, రామచంద్రారెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు

సింహాద్రిపురం విద్యార్థి ఎంపిక



ప్రతిభ కనపరచిన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్

సింహాద్రిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన హబీబూర్ రహిమాన్ అనే విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు శ్రీ వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ ఖాదర్‌వలీ తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరంలో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 బాల బాలికల విభాగంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జితేంద్ర, హుస్సేన్ బాషా, అతికుల్ రెహమాన్ కూడా రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచి కాస్యం పతకం సాధించారన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన హబీబూర్ రెహమాన్ ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ జాఫర్ వలీ, పీడీ త్రిలోక్‌నాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు ఆన్‌లైన్ కోర్సులపై అవగాహన సదస్సు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం సురభి సెమినార్ హాల్‌లో స్వయం, స్వయం ప్లస్, మూక్స్‌పై 5వ తేదీ శుక్రవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు వైవీయూ స్వయం ప్లస్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌పీ వెంకట రమణ తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురుగన్ కీలకోపన్యాసం చేస్తారన్నారు. పీఎం ఉషా కోఆర్డినేటర్ డాక్టర్ టి.చంద్రశేఖర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

15న శ్రీవారి కల్యాణం

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోవిందమాల భక్తబృంద సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ ఉత్సవాన్ని ఈనెల 14, 15 తేదీల్లో వైభ వంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కడప మున్సిపల్ మైదా నంలో 14న ఉదయం సుప్రభాతంతో కార్యక్రమం మొదలవుతుంది. కొలువు అనంతరం గోపూజ, మూలవర్లకు అభిషే కాలు, నిశ్చితార్థం నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం సువాసీనీలతో సామూహిక కుంకుమార్చన ఎదురోకో లోత్సవం నిర్వహిస్తారు. 15న ఉదయం 9గంటలకు పచ్చని తోరణాలు, మంగళవా యిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చార ణలు.. అన్నమయ్య సంకీర్తనల మధ్య వైభవంగా శ్రీవారి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 5గంటలకు నిర్వహించే గ్రామోత్సవంలో గరుడ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి నగర ప్రజలకు దర్శనమివ్వనున్నారు. మున్సిపల్ మైదానం నుంచి ప్రారంభమయ్యే ఈ నగరోత్సవం కోలాటా లు, చెక్కభజన, బ్యాండ్ మేళాలు, పంచ వాయిద్యాలు, బాణసంచా వెలుగుల మధ్య అప్సర సర్కిల్, ఎన్జీవో కాలనీ, వైజంక్షన్, ఆర్టీసీ బస్టాండు, కోఆపరేటివ్ కాలనీ, అన్నమయ్య సర్కిల్ వరకు సాగనుంది. భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని గోవిందమాల భక్త బృంద సేవాసమితి చైర్మన్ మాదు పుల్లారెడ్డి కోరారు.

స్క్రబ్ టైఫస్ పట్ల అప్రమత్తత అవసరం

కడప కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల వ్యాప్తి చెందుతున్న స్క్రబ్ టైఫస్ ఫీవర్‌ను అరికట్టేందుకు వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రజా దృక్పథం, సీజనల్ వ్యాధులు, ఆరోగ్య శాఖ ప్రాధాన్యతలు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ అదితిసింగ్‌లు హాజరయ్యారు. సీఎస్ వీసి ముగిసిన అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు చేపడుతున్న అభివృద్ధి, ప్రత్యేక అమలు కార్యక్రమాలను అధికారులు బాధ్యతగా పూర్తి చేయాలన్నారు.

జాతీయ జంబోరీలో కడప స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతిభ



స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్‌లో నవంబరు 23 నుంచి 29 తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలో జరిగిన 19వ జాతీయ జంబోరీలో కడప జిల్లా నుంచి ఖాదర్ బాష, చంద్రావతి నేతృత్వంలో 50మంది పాల్గొన్నారు. స్టేట్ ఎక్స్‌పో, అడ్వెంచర్, స్టేట్ డే, క్యాంప్ క్రాఫ్ట్ వంటి విభాగాల్లో వారు ప్రతిభ కనబర్చారు. దేశ స్థాయి పేజెంట్ షోలో అన్నమాచార్య కళాశాల రెంజర్లు కోమందురు పవిత్ర, సుమన సుజ ప్రదర్శనలు ఆకట్టుకొని ఉత్తమ పురస్కారం అందుకున్నారు. వీరిని డీఈఓ, చీఫ్ కమీషనర్ డాక్టర్ షంషుద్దీన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకట సుబ్బయ్య, అహమ్మద్ సగినాల, జగదీష్, అమర్నాథ్‌బాబు, రాజేష్, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రావతి, పావని తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కమిషనర్‌పై విచారణకు ఉత్తర్వులు

ప్రొద్దుటూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా వున్న కొండయ్యపై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. బాపట్ల మున్సిపాలిటీలో పనిచేసినప్పుడు కరోనా సమయంలో బ్లీచింగ్ పౌడరు కొనగోలులో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు యూడీఎంఏ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ చార్జ్ మెమో జారీ చేశారు. వారం పది రోజులలోపు ఈ ఆరోపణలపై అసిస్టెంట్ కమిషనర్ సంజాయిషీ ఇవ్వాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వుల్లో తెలిపారు.

పోలీసు స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

కడప క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌకు పోలీసుస్టేషన్ ఎదుట గురువారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలిలా.. కడప మృత్యుంజయకుంటలో నివాసం ఉంటున్న మహ్మద్‌రఫి, అమ్మాజీల కుమారుడు పెద్దకుళ్లాయప్ప (18) పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో అతని తల్లి చిన్నచౌకు పోలీసుస్టేషన్ వద్దకు వెళ్లి తన కుమారుడిని విడిపించకపోతే ఆత్మహత్యకు పాల్పడతానంటూ విష ద్రావణం తాగింది. వెంటనే ఆమెను పోలీసులు వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ఈక్రమంలోనే అమ్మాజీపై కూడా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ భర్త మాట్లాడుతూ తమ కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని, పోలీసులు ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు కేసులు పెట్టి ఇరికించారని ఆరోపించారు. దీంతో తన భార్య తీవ్ర మానసిక వేదనకు గురై ఈ సంఘటనకు పాల్పడినట్లు తెలిపారు.

ముంబై పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు

కడప క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధి నకాశ్ ప్రాంతంలో నివశిస్తూ రెండేళ్ల కిందట ఆసిఫ్ అనే వ్యక్తి ముంబైకి జీవనాధారం కోసం వెళ్లాడు. అక్కడ ఏడాదిన్నర క్రితం ఓ హత్యకు పాల్పడ్డాడు. తరువాత చాలా కాలం పోలీసులకు దొరకకుండా కడపకు వచ్చాడు. పోలీసులు అతన్ని ఫోను ద్వారా ఆధునిక టెక్నాలజీ ద్వారా కనుగొని కడపకు వచ్చారు. టూటౌన్ ప్రాంతంలో ఉన్న ఆసిఫ్‌ను తమ వెంట తీసుకుని వెళ్లారు.

కొనసాగుతున్న ఏసీఏ అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు కొనసాగుతున్నాయి. గురువారం ఏసీఏ క్రికెట్ మైదానంలో రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్-నార్త్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 55.2 ఓవర్లలో 111 పరుగుల స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది.

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్ విన్నర్స్- సౌత్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య మ్యాచ్ సాగింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు 21 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 88 పరుగుల స్వల్ప స్కోర్ చేసింది. బౌలింగ్ విభాగంలో సెంట్రల్ జోన్ విన్నర్స్ బౌలర్ విక్రేష్ 4 వికెట్లు పడగొట్టారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్టు వెలుతురు సరిగా లేకపోవడంతో మ్యాచ్ మధ్యలోనే నిలుపుదల చేశారు.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్-రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 55 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసింది. ఇందులో రిషి 66 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు వెలుతురు సరిగా లేని కార ణంగా ఆట మధ్యలోనే నిలిపేశారు.

'మంత్రికి, ఆయన అనుచరులకు సంబంధం లేదు'



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

రామాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు విజయభాస్కర్‌పై దాడికి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి గానీ, ఆయన అనుచరులకు ఎలాంటి సంబంధం లేదని టీడీపీ మండల అధ్యక్షుడు గాలివీటి సురేందర్‌రెడ్డి ఖండించారు. రామాపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు వారిపై వారే దాడులు చేసుకుని ఇతరులపై బురద చల్లడం అలవాటు అయిపోయిందన్నారు. నిజాలు తెలుసుకొని మాట్లాడితే మంచిదని, రాజకీయాల్లో ఎవరైనా హుందాగా ప్రవర్తించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి రామకృష్ణ గౌడ్, యువనాయకుడు దేవదర్శన్‌రెడ్డి, పొమ్మల రమేశ్ పాల్గొన్నారు.

వ్యసనాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

గాలివీడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని లక్కిరెడ్డిపల్లె సీఐ టీవీ కొండారెడ్డి సూచించారు. గురువారం గోరాన్‌చెరువు గ్రామ సచివాలయంలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ-ప్రజల్లో జాగృతి పెంపుదల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నివారణలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో ముఖ్యమని, గ్రామాభివృద్ధికి శాంతి భద్రతలు కీలకమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతి

నందలూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందలూరు పంచాయతీలో ఉన్న శివసాయి వైన్‌షాపు వద్ద టీవీపురం గ్రామానికి చెందిన ఎర్రగుళ్ల రోశయ్య(65) మద్యం మత్తులో ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. గతంలో కూడా ఇదే కాలువలో పడి ఇద్దరు మృతిచెందిన సంఘటనలను ప్రజలు ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు.

దాసరి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆనంద్‌కుమార్ ప్రమాణస్వీకారం



గాలివీడు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ దాసరి సంక్షేమ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్‌గా మారువేణి ఆనంద్ కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడ గొల్లపుడి బీసీ భవన్‌లో గురువారం అట్టహాసంగా జరిగిన దాసరి సంక్షేమ, అభివృద్ధి బోర్డు డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో దాసరి కులస్తుల సంక్షేమం, అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

ఉప్పొంగిన గుంజనేరు

● రాకపోకలకు అంతరాయం



మూగవారిపల్లె వద్ద లోలెవల్ కాజ్‌వేపై...

పెనగలూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటి కారణంగా మండలంలో ప్రవహిస్తున్న గుంజనేరు ఉప్పొంగడంతో పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మూగవారిపల్లె సమీపంలోని లోలెవల్ కాజ్‌వేపై ఐదు అడుగుల ఎత్తు మేర వరదనీరు ప్రవహిస్తుండడంతో రాజంపేట నుంచి కొండూరు, సిరివరం, నందలూరు మండలంలోని చుక్కాయపల్లె గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సు వయా సింగనమల హైలెవల్ బ్రిడ్జిపై నుంచి దారి మళ్లించి నడుపుతున్నారు. ఇదిలా ఉండగా సింగనమల హైలెవల్ వంతెన కింద ప్రవహిస్తున్న వరద నీరు సింగనమల, ఇండ్లూరు, కొత్తపల్లె పొలాలను ముంచెత్తింది. వెలగచర్ల సమీపంలోని అలుగుపైన ఐదు అడుగుల మేర వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. చుక్కాయపల్లె వరకు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు తిరుణంపల్లె, రెడ్డివారిపల్లె మధ్యలో అడవుల నుంచి భారీ ప్రవాహంతో ప్రవహిస్తున్న కలేటివంక, బుద్దుడు కలేటివంక ఉధృతి కారణంగా కొండూరు నుంచి వెనుదిరగాల్సి వస్తోంది. భారీ వర్షాలతో ప్రమాదకర సంఘటనలు ఎదురవుతున్నప్పటికీ మహిళలు ఉచిత ప్రయాణాలు మాత్రం తగ్గకుండానే సాగిస్తున్నారు.

చిమ్మ చీకటిలో మండల కేంద్రం

పెనగలూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను ప్రభావంతో మంగళవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు మండలంలో జోరువాన కురిసింది. ఈ వర్షానికి నాగిరెడ్డిపల్లె సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో మండల కేంద్రం బుధవారం రాత్రి పది గంటల నుంచి తెల్లారేవరకు చిమ్మచీకటిలో గడిపారు. ఇదిలా ఉండగా ఏఇ ఓబులేరెడ్డి, లయన్ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది జోరు వాన కురుస్తున్నా లెక్కచేయకుండా ముబ్బుల్లో టార్చిలైట్ల వెలుతురులో ఒంటిగంట వరకు శ్రమించి తెల్లవారు జామున కొత్త ఇన్సులేటర్లు అమర్చి తెల్లారే సమయానికల్లా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

పునరావాస కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే



ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్

రైల్వేకోడూరు రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోడూరు పట్టణంలో ఏర్పాటు చేసిన తుఫాను పునరావాస కేంద్రాలను గురువారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రాజంపేట సబ్‌కలెక్టర్ హెచ్‌ఎస్ భావన, ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డేతో కలిసి పరిశీలించారు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో అధికారులు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పట్టణంలోని చిట్వేలి రోడ్డు బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి అక్కడున్న మౌలిక వసతులపై అధికారులతో ఆరా తీశారు. బాధితులకు సకాలంలో భోజన సదుపాయం, వైద్యసేవలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుఫాను బాధితులకు టీడీపీ పట్టణ ఇన్‌చార్జి పోకల మణి భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిని పరిశీలించి ఆసుపత్రిలో అందే వైద్యసదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు అమర్‌నాథ్, ఎంపీడీవో నాగిరెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పఠాన్‌మౌలా, వార్డు సభ్యులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, బండారు బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిట్వేలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దిత్వా తుపాను ప్రభావం కారణంగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజంపేట సబ్‌కలెక్టర్ భావన, ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే ప్రజలకు సూచించారు. రాజంపేట-రాపూరు ప్రధాన రహదారిలో రాజుకుంట క్రాస్ రోడ్డు అంజనేయస్వామి సమీపంలో ఉన్న లోలెవల్ కల్వర్టుపై వరదనీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో వారు గురువారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రెవెన్యూ, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ ఏఈ నరేంద్ర, ఏఎస్ఐ వెంగయ్య, ఆర్ఐ నిఖిల్, వీఆర్వో సుధాకర్, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే ఐఆర్ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రమణ్యంరాజు

రాజంపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సంయుక్త అధ్యక్షుడు వై.సుబ్రమణ్యంరాజు అన్నారు. గురువారం రాజంపేట మన్నూరు ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్టీయూ రీజనల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినా ఉపాధ్యాయ సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం రీజనల్ కన్వీనర్ నరసింహులు, ఉపాధ్యక్షులు బి.ఆదినారాయణ, కడియాల మురళి, జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

చిన్నమండెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవపట్ల క్రాస్ రోడ్డు వద్ద ఏడుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని కడప-బెంగళూరు జాతీయ రహదారి ఆనుకుని ఉన్న దేవపట్ల క్రాస్ రోడ్డు వద్ద గురువారం మధ్యాహ్నం జూదమాడుతున్నారన్న సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశామని, ఈ దాడిలో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకొని రూ.90,890 నగదును స్వాధీనం చేసుకుని ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో జూదమాడుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు కలెక్టరేట్ వద్ద వీఆర్ఏల నిరసన

సిద్దవటం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ నౌకర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 5న కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటపతి తెలిపారు. ఈ మేరకు గురువారం తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూశాఖలో సుదీర్ఘకాలం నుంచి చాలా తక్కువ వేతనంతో పనిచేస్తున్న వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏలు కిషోర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీచక్ర మహాయంత్ర పూజలు

రైల్వేకోడూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో గురువారం శ్రీచక్ర మహాయంత్ర పూజలు దేవస్థానం కమిటీ చైర్మన్ శ్రీరాం సుబ్రమణ్యం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో హోమాలు, పూజలు చేశారు. పలువురు మహిళలు లలితా సహస్రనామాలు పఠించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండ్యాల విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ నిధులు ఎంపీటీసీలకు కేటాయించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి

రాయచోటి(నేతాజీ సర్కిల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ నిధుల విషయంలో రాజకీయ జోక్యం లేకుండా ఎంపీటీసీ సభ్యులకు కేటాయించాలని ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ సభాభవనంలో ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ప్రారంభం కాగానే రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్‌నాయుడు అక్కడికి వచ్చారు. తనను ప్రొటోకాల్ ప్రకారం స్టేజీపైకి పిలవాలని చెప్పడంతో ఆ ప్రకారం అవకాశం లేదని, సభను గౌరవించాలని ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి చెప్పడంతో ఆయన సమావేశం నుండి వెళ్లిపోయారు. అనంతరం సమావేశంలో శాఖల వారీగా మండల అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు వివరించారు. మండల పరిషత్ నిధుల కింద రూ.40 లక్షలు ఉన్నాయని, ఈ నిధులు ఎంపీటీసీ సభ్యులకే కేటాయించి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకరించాలని కోరారు. ఇందుకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, జెడ్పీటీసీ గొర్ల కవిత, మండల స్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీ, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు



ఘంటసాల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కళాకారులు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు స్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వరరావు అని రంగ స్థలం నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఘంటసాల 103వ జయంతి సందర్భంగా లక్కిరెడ్డిపల్లెలోని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఘంటసాల ఎన్నో పౌరాణిక సాంఘిక సినిమాల్లో ఎన్నో మధురమైన పాటలు పాడి ప్రేక్షకులను ఆనందపరచారని కొనియాడారు. కార్యక్రమంలో తిరుమల, తిరుపతి దేవస్థానం హార్మోనిస్టు మహదేవ, చెక్కభజన గురువు ఆదినారాయణ, కళాకారులు రామాంజనేయులు, శంకరయ్య, అశోక్‌కుమార్, విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్రమణ్యం, రమణ, విజయభాస్కర్‌నాయుడు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా యూటీఎఫ్ సభ్యత్వం

పెనగలూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రంపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది గురువారం హెచ్‌ఎం లేబాకు గోపాలకృష్ణ అధక్షతన యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా యూటీఎఫ్ సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై నిరంతరంగా పోరాటం సాగిస్తుంటుందన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనకు ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను నిర్వహించాలనుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో అన్వర్‌బాషా, మహేంద్ర, సుదర్శనన్, శివ, నరసింహులు, ప్రసాద్, వెంకటరెడ్డి, కృష్ణకుమారి, ప్రమీల, శ్రీవాణి, పరిమిళ, దేవమణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలి

● కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన చమర్తి




రాజంపేట టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు, జనసేన పార్టీ పార్లమెంట్ నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు గురువారం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాజంపేటకు వచ్చిన కలెక్టర్‌ను వారు కలిసి రాజంపేటను జిల్లా కేంద్రం చేయడానికి అన్ని అర్హతలు ఉన్నాయని వివరించారు. ప్రధానంగా మూడు నియోజకవర్గాలకు సెంటర్‌గా రాజంపేట ఉందని, ఇక్కడి ప్రజల మనోభావాలను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో రాజంపేట టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు మేడికొండు రవికుమార్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు శివకుమార్, గీతాంజలి రమణ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం చేయాలని ర్యాలీ

చిట్వేలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అన్నివిధాల అర్హత కలిగిన రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని గురువారం సాయంత్రం చిట్వేలి జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక గుంజనేరు బ్రిడ్జిపై నినాదాలు చేశారు. మహిళలు సైతం ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇంతియాజ్‌అహ్మద్, శ్రీను, మణి, కాకి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పాత బస్టాండు కూడలిలో నేడు ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న అబూబకర్

రాజంపేట టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ శుక్రవారం రాజంపేట పట్టణంలోని మసీదుల వద్ద ఆందోళనలు నిర్వహిస్తామని మైనార్టీ నాయకులు అబూబకర్, కరీం తదితరులు వెల్లడించారు. గురువారం సాయంత్రం రాజంపేటలో జేఏసీ కార్యాచరణ సమావేశంలో వారు మాట్లాడుతూ శుక్రవారం రాజంపేట పాతబస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించడంతో పాటు ధర్నా నిర్వహిస్తామన్నారు. రాజంపేట ఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు లావులూరి శ్రీనివాసులు, సంఘ సంస్కర్త అల్లం సుబ్రమణ్యం, జేఏసీ నాయకుడు అబ్బూరు ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ రాజంపేట జిల్లా కేంద్రం కోసం అన్ని సంఘాలతో కలిసి కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాజంపేట, కోడూరు ప్రజల మనోభావాలను గుర్తించి రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలన్నారు.

13న జాతీయ లోక్‌అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్

రాజంపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజంపేట కోర్టు సముదాయాల్లో ఈనెల 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. గురువారం రాజంపేట కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో జాతీయ లోక్‌అదాలత్ విజయవంతంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవడానికి కక్షదారులతో మాట్లాడి తగు సూచనలు చేయాలని పోలీసులకు సూచించారు. చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న సోమశిల ముంపు ప్రాంతాల కేసులు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కేశవ, జూనియర్ సివిల్ జడ్జి రాజన్, సోమశిల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణ, ఏజీపీ మౌనిక, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల దరఖాస్తుకు నేడు ఆఖరు

రాయచోటిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని 17 మండలాల్లో ఉన్న 48 పాఠశాలల్లో ఐదు నెలల కాల వ్యవధితో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసేందుకు ఈనెల 5వ తేదీ శుక్రవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో సుబ్రమణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈడీ, బీఈడీ పూర్తి చేసుకున్న ఛాత్రోపాధ్యాయ అభ్యర్థులు చిట్వేల్, గాలివీడు, రైల్వేకోడూరు, కేవీపల్లి, లక్కిరెడ్డిపల్లె, నందలూరు, పెనగలూరు, పుల్లంపేట, రాజంపేట, రాయచోటి, వీరబల్లి, సుండుపల్లె, మొలకలచెరువు, పెద్దతిప్పసముద్రం, మదనపల్లి, సంబేపల్లె, కలకడ తదితర 17 మండలాల్లోని 48 పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికపైన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లగా పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఆయా మండలాల పరిధిలోని ఎంఈవో అధికారులకు తమ దరఖాస్తును అందజేయాలని సూచించారు.

పెద్దజంగంపల్లి హైస్కూల్‌లో ఒక పోస్టు..

రాయచోటి(నేతాజీ సర్కిల్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దజంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయాలజీ సబ్జెక్ట్ బోధించేందుకు అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో రమాదేవి గురువారం తెలిపారు. అభ్యర్థులు బీఎస్సీ బీఈడీ చదివి ఉండాలన్నారు. ఈనెల 5వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తులను ఎంఆర్సీ కార్యాలయంలో అందించాలన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంఈవో సూచించారు.

నేడు మెగా పేరెంట్స్ మీటింగ్

రామాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామలాదేవి తెలిపారు. స్థానిక ఏపీ ఆదర్శ పాఠశాలలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల మౌలిక సదుపాయాలు, విద్య, విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులందరూ హాజరుకావాలని కోరారు.

మీటింగ్‌ను విజయవంతం చేయండి

చిన్నమండెం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీలోని మల్లూరు కస్పాకు చెందిన జెడ్పీ హైస్కూల్‌లో నేడు జరిగే పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని ఎంఈవో ఆంజనేయులు, టీడీపీ మండల అధ్యక్షుడు మూగి రెడ్డెప్ప పిలుపునిచ్చారు. ఈ పేరెంట్స్ మీటింగ్‌కు ముఖ్య అతిథులుగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్ హాజరవుతారని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపటి నుంచి రిలే దీక్షలు

ఒంటిమిట్ట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను కడప జిల్లాలోనే ఉంచాలని ఈనెల 6వ తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు మండల జేఏసీ నాయకులు తెలిపారు. గురువారం సాయంత్రం వీరు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక కోదండరామాలయం సమీపంలో దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిద్దవటం ఒంటిమిట్ట మండలాలకు కడప దగ్గరలో ఉందని ఈ రెండింటిని కడప జిల్లాలోనే ఉంచాలన్నారు. అలాగే అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మోదుగుల పెంచలయ్య, యానాది, రామదాసు, కట్టా యానాదయ్య, పాటూరు గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె ఎస్ఐగా ఎస్‌కేఎం హుస్సేన్

సుండుపల్లె, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె ఎస్ఐగా ఎస్‌కేఎం హుస్సేన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ఏ సమస్యలు ఉన్నా ప్రజలు స్వచ్ఛందంగా తనను కలవవచ్చునని తెలిపారు.

సంక్షేమ పథకాల పారదర్శక అమలుకు చర్యలు

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు ప్రజలకు పారదర్శకంగా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం ముందడుగు వేసిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక చెన్నముక్కపల్లిలోని డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిలో భాగంగా 77 డీడీవోలు ప్రారంభించామని, ప్రజలకు సేవలందించడానికి డీడీవో కార్యాలయాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జీఎస్‌డబ్ల్యువో సూపరింటెండెంట్ లక్ష్మీపతి, డీడబ్ల్యూఎంఏ పీడీ వెంకటరత్నం, పంచాయతీ సెక్రటరీలు, అధికారులు, ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి

ఆస్తుల కోసం వేధిస్తున్నారు

- కోడలు, మనవరాళ్లతో ప్రాణహాని
- రక్షణ కల్పించాలని వృద్ధ దంపతుల వేడుకోలు


మాట్లాడుతున్న వృద్ధ దంపతులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాము కష్టపడి సంపాదించిన ఆస్తుల కోసం కోడలు, మనవరాళ్లు వేధిస్తున్నారని వృద్ధ దంపతులు చిన్నప్ప, గోపమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కుమార్తె కమలతో కలిసి వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కురబలకోట మండలం తెట్టు గ్రామం, గుంతపల్లె వంకకు చెందిన తాను కరెంటు ఆఫీసులో అటెండర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చెందానన్నారు. తమకు సుధాకర్, సురేష్‌కుమార్, కవల పిల్లలని వీరిలో సుధాకర్ వివాహం కాకనే చనిపోగా, రెండో కుమారుడు సురేష్ కుమార్ ఏడాది కింద చనిపోయాడని తెలిపారు. కుమార్తె కమల పట్టణంలోని కనకదాస్ నగర్‌లో ఉంటోంది. కాగా సురేష్‌కు పుట్టిన ముగ్గురు ఆడపిల్లలకు పెన్షన్‌తోనే చదివించి ఆలనా పాలనా చూశామని కొడుకు చనిపోగానే కోడలు మంజుల, మనవరాళ్లు మానస, పావని, నవ్యశ్రీ తమ ఆస్తి కోసం పాకులాడుతున్నారని ఆరోపిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. తాము కొన్నేళ్లుగా నీరుగట్టువారిపల్లె, మాయాబజారులో సొంత ఇంట్లో ఉండేవారమని గొడంలు పెట్టుకుని గెంటేయడంతో స్వగ్రామం గుంతలవంకకు వెళ్లామన్నారు. రెండు రోజుల క్రితం కోడలు, మనవరాళ్లు వచ్చి పొలాలు, ఇళ్లు రాసి ఇవ్వాలని బెదిరించారని ఆరోపించారు. సొంత ఊళ్లో దాయాదుల భూమి భాగ పరిష్కారం కాలేదని, కనకదాస్ నగర్‌లో ఉండే ఇంటికి ఆక్రమించుకుని కోడలు బాడుగకు ఇచ్చిందని ఆ ఇల్లు తమకు ఇప్పించాలని వేడుకున్నారు. వేధింపులకు గురి చేస్తే పల్లె వద్ద ఉన్న ఎనిమిదెకరాల పొలం, ఇల్లు అనాథ శరణాలయానికి రాసి ఇచ్చేసి మేము కూడా అక్కడికే వెళ్లిపోతామన్నారు. అధికారులు స్పందించి మాకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

నిండుకుండలా చిన్నపోతుల ప్రాజెక్టు

- మొరవ దెబ్బతినడంతో వృథాగా పోతున్న నీరు
- మరమ్మతులు చేస్తే రెండు వేల ఎకరాలకు సాగునీరు
- ఏళ్ల తరబడి పట్టించుకోని పాలకులు


నీటితో కళకళలాడుతున్న చిన్నపోతుల ప్రాజెక్టు


దెబ్బతిన్న ప్రాజెక్టు మొరవ

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరువు సీమలో నీటి నిల్వ చేసి సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టు భూములకు నీరందించే లక్ష్యంతో 1990లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో చిన్నపోతుల ప్రాజెక్టు నిర్మించారు. ఈ ప్రాజెక్టు వల్ల లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు సాగునీరు అందుతుంది. అయితే ప్రాజెక్టు నిర్మించినప్పటి నుంచి ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. ఈ ప్రాజెక్టు కుడి,


పిచ్చిమొక్కలతో నిండిపోయిన కుడి కాలువ

ఎడమ కాలువల ద్వారా కోనంపేట, బి.యర్రగుడి మామిడిగారిపల్లె, పాలెంగొల్లపల్లె, చెంచర్లపల్లి, నల్లగుట్టపల్లి గ్రామాల్లోని పొలాలకు నీరు చేరేవి. అలాంటి కాలువలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎడమ కాలువ పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుకుంది. ప్రాజెక్టు నిండితే మొరవ ద్వారా నీరు వెళ్లి రామరాజు వంకకు చేరుకుని రామాపురం మండలంలోని అన్ని చెరువులకు నీరు చేరుతుంది. ఇలాంటి పెద్ద ప్రాజెక్టుకు ఇంతవరకు మరమ్మతులు చేయలేదు. దీనికి తోడు గండికోట నుంచి చక్రాయపేట మండలం కాలేటివాగు నుంచి చిన్నపోతుల ప్రాజెక్టుకు పైపులైన్ ద్వారా నీరు అందించేందుకు గతంలో అధికారులు అంచనాలు వేసి పనులు కూడా ప్రారంభించారు. అయితే ఆ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. శేషాచలం అడవుల్లో కురిసిన వర్షపునీరు చిన్నపోతుల ప్రాజెక్టుకు చేరుకుంటుంది. మొరవ దెబ్బతినడంతో కుడి, ఎడమ కాలువలు తెగిపోయాయి. మొరవ కొట్టుకుపోయి పోవడంతో నీరంతా వృథాగా పోతోంది. ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తే వేసవిలో కూడా ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంటుంది. చుట్టూ ఉన్న గ్రామాల్లోని బోర్లకు నీరు తగ్గకుండా ఉంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రాజెక్టు కల్వర్టుతో పాటు కుడి, ఎడమ కాలువలు కాలువలు నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



చిన్నపోతులపల్లి ప్రాజెక్టు మొరవ, కుడి, ఎడమ కాలువలకు మరమ్మతులు చేస్తే ఎండాకాలంలో కూడా ఉంటాయి. మూడుకార్ల పంటలు పండించుకోవచ్చు. అధికారులు స్పందించి కల్వర్టు కుడి, ఎడమ కాలువలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

- వెంకట్రమణ, చిన్నపోతులపల్లి

ఎవరూ పట్టించుకోలేదు



1990లో నిర్మించిన చిన్నపోతుల ప్రాజెక్టుకు ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదు. అధికారులకు తెలిపినా ఎవ్వరూ పట్టించుకోలేదు. వచ్చిన నీరంతా వృథాగా పోతోంది. కనీసం 100 ఎకరాలకు కూడా సక్రమంగా నీరు అందడం లేదు.

- వేణుగోపాల్, చిన్నపోతులపల్లి ప్రాజెక్టు చైర్మన్

రాచవేటివారిపల్లిలో దొంగల హల్‌చల్

- డబ్బు, నగలు చోరీ


చిందరవందరగా వేసిన బీరువాలోని వస్తువులు

నిమ్మనపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాచవేటివారిపల్లి పంచాయతీ గారబురుజులో బుధవారం రాత్రి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి నగదు, బంగారాన్ని దోచుకెళ్లినట్లు ఇంటి యజమాని మంచూరి వేణుగోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ రవినాయక్, ఎస్ఐ తిప్పేస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ వేణుగోపాల్‌రెడ్డితో ఆయన భార్య కళావతి వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. వీరికి రెండు ఇళ్లు వుండగా ఒక ఇంట్లో నిద్రిస్తూ మరో ఇంటికి తాళాలు వేసేవారు. బుధవారం రాత్రి 11 గంటల వరకు మేల్కొని వుండి అనంతరం ఒక ఇంటికి తాళం వేసి మరో ఇంట్లో పడుకున్నారు. ఇదే అదునుగా భావించి దొంగలు రాత్రి 12 గంటల పైన తాళం వేసిన ఇంటి తాళాలు తెరిసి బీరువా తాళానికి పెట్రోల్ పోసి నిప్పుపెట్టి అందులో ఉన్న 10 గ్రాముల బంగారం, రూ.95 వేల నగదు దోచుకెళ్లారు. గురువారం ఉదయం వేణుగోపాల్‌రెడ్డి నిద్ర లేచి చూడగా అప్పటికే ఇంటి తాళం తీసి ఉండడంతో ఇంట్లోని బంగారం, డబ్బు లేకపోవడంతో వెంటనే పోలీసులకు విషయాన్ని తెలుపగా వారు క్లూస్ టీంతో వచ్చి ఇంటి పరిసరాలను తనిఖీ చేసి చుట్టుపక్కల వారిని విచారించారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి వచ్చి వుంటారని అనుమానిస్తున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

డీడీవోలతో మరింత బలోపేతం


డీడీవో కార్యాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో చేపట్టిన డివిజనల్ అభివృద్ధి అధికారులతో పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. గురువారం మదనపల్లె డీడీవో కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే పంచాయతీరాజ్ ఉద్యోగులకు ఒక గౌరవం తీసుకొచ్చిన ఘనత డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కే చెందుతుందన్నారు. ఆయన నమ్మకానికి అనుగుణంగా పంచాయతీరాజ్ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్టపడి పనిచేయాలన్నారు. ముఖ్యంగా పంచాయతీ సెక్రటరీలు పనితీరు మెరుగుపరుచుకుంటూ, ప్రజలకు సేవలందించాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచుల భాగస్వామ్యంతో పాలన అందించాలే కాని సర్పంచులు చెప్పిందల్లా చేయకూడదని హితవు పలికారు. డీఎల్‌పీవో నాగరాజు మాట్లాడుతూ డీడీవో పర్యవేక్షణలో డివిజన్ అభివృద్ధికి అందరం కలసికట్టుగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో 11 మండలాల ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నవీన్‌చౌదరి, టీడీపీ నేతలు ఆర్‌జే వెంకటేశ్, జేవీ రమణ, పెంచుపాడు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో యూటీఎఫ్ పాత్ర కీలకం : డీఈవో


పదో తరగతి మోడల్ పేపర్స్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిలో యూటీఎఫ్ పాత్ర కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని డీఈవో కార్యాలయంలో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ రూపొందించిన పదో తరగతి మోడల్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ కేవలం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధిలో కూడా కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు నిరంతరం పాటు పడుతుందని, హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించిన సంఘంగా యూటీఎఫ్ రాణిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యార్థుల క్షేమం గురించి ఆలోచించడం ఒక్క యూటీఎఫ్‌కు మాత్రమే సాధ్యమన్నారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబీర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది నిష్ణాతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులచే మోడల్ ప్రశ్నాపత్రాలను రూపొందించి విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మోడల్ పేపర్స్ కావాల్సినవారు 9440181800, 9849534690 నెంబర్లతో పాటు ఆయా ప్రాంతాల్లోని యూటీఎఫ్ నాయకత్వాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ శివారెడ్డి, జిల్లా కార్యదర్శి దావూద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రరెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, అమీన్, రఫీక్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, ఇమ్రాన్, రాజారమేశ్, రియాజ్, బసయ్య తదితరులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన వద్దు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య

రాయచోటి (నేతాజీ సర్కిల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ఆందోళన అవసరం లేదని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రస్తుతం మన జిల్లా పరిధిలో ఇప్పటికే 289 నమూనాలు సేకరించామని ఇందులో కేవలం 39 పాజిటివ్ కేసులు మాత్రమే వచ్చాయన్నారు. ఈ వ్యాధి తీవ్రమైనది కాదని, ఇందుకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందన్నారు. బ్యాక్టీరియా కుట్టిన చోట నలుపు రంగులోకి మారి మచ్చగా ఏర్పడుతుందని, దీనివల్ల అధిక జ్వరం, తలనొప్పి, అధిక నొప్పులు, వైరల్ జ్వరంగా మారే అవకాశాలు ఎక్కువ కావున మూడు రోజులుగా పైబడి ఉంటే సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లి సకాలంలో చికిత్స తీసుకుంటే వ్యాధి నయం అవుతుందన్నారు. వైద్య సిబ్బంది ప్రతి గ్రామంలో పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

జాతీయ జంబోరీలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి

రాయచోటిటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లక్నోలో గత నెల 22 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ జాతీయ జంబోరీలో పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపిన జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లు, విద్యార్థులను గురువారం మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, డీఈవో సుబ్రమణ్యం అభినందించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ జాతీయ జంబోరీలో నేపాల్, శ్రీలంక, సౌదీ అరేబియా దేశాలతో పాటు దేశ వ్యాప్తంగా దాదాపు 35 వేల మంది పాల్గొనగా జిల్లా నుంచి 62 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఇందులో జిల్లా విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్లు సాధించినట్లు తెలిపారు. గురువారం జిల్లాకు చేరుకున్న విద్యార్థులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, డీఈవో సుబ్రమణ్యం ప్రత్యేకంగా అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

వాల్మీకిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆరమడక గ్రామానికి చెందిన శ్రీనాథ్ (38) స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో వెళ్తూ మార్గమధ్యలో కూరపర్తి గ్రామం వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు.

తీవ్రంగా గాయపడిన శ్రీనాథ్‌ను గ్రామస్తులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం తెలియజేశారు.

మద్యం మత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి...



వాల్మీకిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు ట్రాన్స్‌ఫార్మర్‌పై కూర్చుని హల్‌చల్ చేసిన సంఘటన గురువారం వాల్మీకిపురం మండలంలోని తాటిగుంటపల్లె గ్రామ పంచాయతీలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పంచాయతీ పరిధిలోని గజ్జలవారిపల్లెలో విద్యుత్ స్తంభాలకు ఉన్న వీధి లైట్లను, విద్యుత్ లైన్లు మార్చే దిశగా ట్రాన్స్‌కో సిబ్బంది పనులు చేపట్టారు. అయితే వీధిలైట్లకు సంబంధించిన వస్తువులను తీసుకెళ్లాడని నాగార్జున అనే యువకుడిని పంచాయతీ సెక్రటరీ ప్రశ్నించాడు. మద్యం మత్తులో ఉన్న నాగార్జున తననే అనుమానించి ప్రశ్నిస్తావా అంటూ సెక్రటరీని బెదిరించి ఆపై విద్యుత్ స్తంభం ఎక్కి ట్రాన్స్‌ఫార్మర్‌పై గొడుగు పట్టుకుని కూర్చోవడమే కాక బిగ్గరగా కేకలు వేస్తూ ట్రాన్స్‌కో సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేశాడు. ఆ సమయానికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయాన్ని గమనించిన గ్రామస్థులు ఎంత చెప్పినా యువకుడు వినకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న నాగార్జునను కిందికి దింపి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాలపై మద్యం తాగుతుండగా రైలు దూసుకెళ్లి ఇద్దరు మృతి


వీరభద్రయ్య, మునికుమార్ (ఫైల్)

కలికిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టాలపై మద్యం తాగుతుండగా ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకెళ్లడంతో ఇద్దరు మృతి చెందిన సంఘటన కలికిరి రైల్వేస్టేషను వద్ద బుధవారం రాత్రి జరిగింది. కదిరి రైల్వే పోలీసు ఎస్ఐ బాలకృష్ణ వివరాల మేరకు.. గుట్టపాళెం గ్రామం ఆచార్ల కొత్తపల్లెకు చెందిన జి.వీరభద్రయ్య (49) కలికిరి పట్టణంలోని పోలీసుస్టేషన్ రోడ్డులో కాపురముంటున్నాడు. ఇతను ఇళ్ల బాడుగలతో జీవనం సాగిస్తున్నాడు. సోమల మండలం ఇరికిపెంటకు చెందిన మునికుమార్ (27) కలికిరిలోని ఏఎస్ఆర్ కాలనీలో నివాసముంటూ దోబీ పని చేస్తున్నాడు. ఇద్దరూ స్నేహితులు. బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇద్దరూ కలిసి మద్యం తాగేందుకు రైల్వే స్టేషను వద్దకెళ్లారు. అక్కడున్న సెక్యూరిటీ అడ్డు చెప్పడంతో స్టేషను తూర్పు వైపు వచ్చి పట్టాల మధ్యలో కూచుని మద్యం తాగుతుండగా అదే సమయంలో ముంబాయి-నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ వేగంగా వెళ్లింది. పట్టాల మధ్యలో ఉన్న ఇద్దరూ తునాతునకలయ్యారు. రైలు లోకోపైలట్ జగదీశ్ దీనిని గమనించి సీటీఎం రైల్వేస్టేషన్‌లో సమాచారం ఇచ్చాడు. ఆ వెంటనే వారిచ్చిన సమాచారంతో కదిరి రైల్వే పోలీసులు కలికిరి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని విచారణ ప్రారంభించారు. మృతుల తండ్రులు లింగయ్య, చంద్రయ్య వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఆత్మహత్య సంఘటనగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. మృతుడు వీరభద్రయ్యకు ఇద్దరు ఇంజినీరింగ్ చదువుతున్న పిల్లలున్నారు. మునికుమార్‌కు రెండేళ్ల కుమారుడున్నాడు. మృతదేహాలకు శవపరీక్షలు పూర్తి చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా వీరిద్దరూ మద్యానికి బానిసలయ్యారని స్థానికులు చెబుతున్నారు. సంఘటనకు ముందు కూడా మునికుమార్ భార్య శ్రీదేవి రైల్వేస్టేషను వద్దకు వెళ్లి భర్తను ఇంటికి రావాలని ప్రాధేయ పడినట్లు సమాచారం.

కిడ్నీ రాకెట్ కేసులో గ్లోబల్ ఆసుపత్రి సీజ్


గ్లోబల్ ఆస్పత్రి వద్ద డీఎస్పీ మహేంద్ర, తదితరులు

మదనపల్లె/మదనపల్లె అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కిడ్నీ మార్పిడి కేసులో పోలీసులు గురువారం ఎస్‌బీఐ కాలనీలోని గ్లోబల్ ఆసుపత్రిలో సోదాలు చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రితోని ఆపరేషన్ థియేటర్, ఆపరేషన్‌కు ఉపయోగించిన పరికరాలు, మందులను స్వాధీనం చేసుకుని ఆసుపత్రితో సహా సీజ్ చేసినట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. గత నెల 9వ తేదీ జరిగిన ఈ సంఘటనలో ఆసుపత్రి అధినేత, అన్నమయ్య జిల్లా డీసీహెచ్ఎస్ కె.ఆంజనేయులుతో పాటు మరో ఏడుగురిని అరెస్టు చేశారు.

అనంతరం ఆంజనేయులును సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో ప్రధానపాత్ర పోషించిన డాక్టర్ ఆంజనేయులుతో పాటు మదనపల్లె డయాలసిస్ కేంద్రంలో పనిచేస్తున్న మేనేజరు బాలరంగడు, కదిరి డయాలసిస్ కేంద్ర మేనేజరు మెహరాజ్, విశాఖకు చెందిన పిల్లి పద్మ, కాకర్ల సత్య, సూరిబాబు, కిడ్నీ మార్పిడి చేసిన బెంగళూరుకు చెందిన డాక్టర్ పార్థసారధిరెడ్డికి సహకరించిన కడపకు చెందిన అనుచరులు కొండయ్య, సుమన్‌లను రెండు విడతలుగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఇదే కేసులో మరో ఆరుగురిపై కేసు నమోదైంది. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలావుండగా, గురువారం జరిగిన ప్రక్రియలో డీఎస్పీతో పాటు వన్, టూటౌన్ సీఐలు ఎస్.మహ్మద్‌రఫీ, రాజారెడ్డి, ఎస్ఐ రహీముల్లా, మదనపల్లె పీపీ యూనిట్ వైద్యులు డాక్టర్ శ్రీధర్, ప్రభాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయులే ప్రధాన నిందితుడు

జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్తగా ఉంటూ మానవఅవయవాల అక్రమ మార్పిడిలో ఆంజనేయులు ప్రధాన నిందితుడని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా వైద్యులైన ఆయన కుమారుడు డాక్టర్ అవినాశ్, కోడలు శాశ్వతిపై కూడా కేసు నమోదైనట్లు తెలిసింది. అలాగే గ్లోబల్ ఆసుపత్రి రిజిస్ట్రేషన్ అయిన ఆంజనేయులు భార్యపై కూడా కేసు నమోదు చేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆసుపత్రి ఎవరి పేరుపై ఉందో ఆ వివరాలు ఇవ్వాలని పోలీసులు ఇప్పటికే వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను కోరారు. అధికారిక సమాచారం వచ్చాక ఆసుపత్రి రిజిస్ట్రేషన్ అయిన వారిపై కూడా కేసు నమోదు చేయనున్నారు. ఇదిలా వుండగా సంఘటన జరిగిన 9వ తేదీ ఆసుపత్రి నుంచి సీసీ ఫుటేజీ, హార్డ్‌డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఎస్ఎఫ్ఎల్ రిపోర్టుకు పంపించగా ఇటీవల నివేదిక వచ్చినట్లు తెలిసింది. ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి ఎన్ని రోజులుగా జరుగుతోంది. ఎంత మందికి చేశారు. అందులోని కిడ్నీ దాత, రిసీవర్‌లు ఎవరు? శస్త్రచికిత్సలు చేసిందెవరన్నది స్పష్టమైనట్లు తెలిసింది. ఇందులో భాగంగా విశాఖపట్నానికి చెందిన యమున (29)కు జరిగిన కిడ్నీ మార్పిడి కంటే ముందు మరొకరికి కూడా చేశారు. ఇందులో ఇద్దరు రిసీవర్‌లు, ఒక డోనర్ బెంగళూరు ఆసుపత్రులలో కోలుకుంటుండగా, యమున మాత్రం అదేరోజు ఇక్కడి ఆసుపత్రిలో మృతి చెందడంతో కిడ్నీ రాకెట్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

కోర్టులో లొంగిపోయిన డాక్టర్ పార్థసారథి



కిడ్నీ రాకెట్ కేసులో ఏ-2 డాక్టర్ పార్థసారథి గురువారం రాత్రి మదనపల్లె సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ కోర్టు న్యాయాధికారి ముందు లొంగిపోయాడు. దీంతో నిందితుడికి రిమాండ్ విధించారు. పులివెందులకు చెందిన డాక్టర్ పార్థసారథి బెంగళూరులో ఉంటున్నాడు. కిడ్నీ మార్పిడి కేసులో నిందితుడిగా ఉన్న ఇతను పరారీలో ఉన్నాడు. పోలీసులు ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో నిందితుడే స్వయంగా కోర్టులో లొంగిపోయాడు. వైద్య పరీక్షల అనంతరం మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు.

బీపీఎస్, ఎల్‌వోఎస్ పథకాలకు అనుమతి

- రీజనల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సంజీవకుమారన్



అధికారులకు సూచనలు ఇస్తున్న రీజనల్ డైరెక్టర్

మదనపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర, పట్టణాల్లోని ప్రజలకు ప్రభుత్వం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్), ల్యాండ్ కన్వర్షన్ స్కీమ్ (ఎల్‌వోఎస్) పథకాలకు అనుమతి ఇచ్చిందని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్, టౌన్, కంట్రీ ప్లానింగ్ (అనంతపురం) అధికారి సంజీవకుమారన్ తెలిపారు. వీటిపై పట్టణాల్లో వినియోగదారులకు అవగాహన, చైతన్యం కల్గిస్తూ వీలైనంతమంది సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆర్డీ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మదనపల్లె, రాయచోటి, పుంగనూరు మున్సిపాలిటీలు సహా బి.కొత్తకోట నగర పంచాయతీ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన ఆర్డీ మాట్లాడుతూ 1985 నుంచి 2025 వరకు నిర్మించిన అన్ని భవనాలకూ బీపీఎస్ పథకం వర్తిస్తుందన్నారు. అనుమతి కన్నా అదనంగా, అక్రమంగా నిర్మించిన ఫ్లోర్లు, ఇతర నిర్మాణాలను సక్రమం చేసుకునేందుకు ఇదొక సువర్ణావకాశమన్నారు. సెట్‌బ్యాక్, ఓపెన్‌సైట్‌లకు కూ డా వర్తిస్తుందన్నారు. రెసిడెన్షియల్, కమర్షియల్ విభాగాలకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుం చెల్లించాలని, ఏదైనా నిర్మాణానికి అసెస్‌మెంట్, డోర్ నెంబర్‌తో పనిలేకున్నా, వేకెన్సీ ల్యాండ్ ట్యాక్సు (వీఎల్‌టీ) ప్రాతిపాదికన దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు. ఎల్ఆర్ఎస్ పథకాన్ని కూడా ప్రభుత్వం వచ్చే ఏడాది జనవరి 23వ తేదీ వరకు పొడిగించిందని ఆర్డీ ప్రకటించారు. ఇదివరకే ఉన్న ల్యాండ్ కన్వర్షన్, లేఅవుట్ చార్జీలను 14 శాతం నుంచి ఏడు శాతానికి ప్రభుత్వం తగ్గించిందని, నిర్దిత గడువులోగా ఆ లేఅవుట్‌లో ఏదో ఒక ప్లాటు రిజిస్ట్రేషన్ అయి ఉంటే అర్హతగా తీసుకుంటామని ఆర్డీ వివరించారు. సమావేశంలో మదనపల్లె మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, టౌన్‌ప్లానింగ్ అధికారి చిన్నరెడ్డెమ్మ, రాయచోటి, పుంగనూరు, బి.కొత్తకోట పట్టణ ప్రణాళిక అధికారులు, వార్డు ప్లానర్స్, ప్రైవేటు లైసెన్స్ ప్లానర్లు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుడి ప్రతిభ


కామిశెట్టి వెంకట్

ప్రొద్దుటూరుటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల్లో పట్టణానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు కామిశెట్టి వెంకట్ ప్రతిభ కనపరిచారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకల్లో శ్లోకాలు, పాటలు పడి ఆకట్టుకున్నాడు. అలాగే నృత్యం, సినిమా డైలాగ్‌లు, లిప్‌రీడింగ్, కర్ణాటక సంగీత గీతాలాపన, పేరడీ పాటలతో అలరించాడు. ఒకే వ్యక్తి విభిన్న కళలను ప్రదర్శించడంతో ఆహూతులు కామిశెట్టి వెంకట్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కామిశెట్టి వెంకట్ తల్లి విశాలాక్షి మాట్లాడు తూ ప్రభుత్వం నిర్వహించే ఉత్సవాల్లో విభిన్న ప్రతిభావంతులకు తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించాలని కోరారు.

చివరి మజిలీకి... ఎన్ని తిప్పలో!

- శ్మశానవాటికకు రహదారి లేక నానా అవస్థలు



బురదలో చేతులపై పాడె తీసుకెళుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికకు సరైన దారి లేక ఆఖరి మజిలి ఓ పరీక్షగా మారింది. బురద నేలలో, ముళ్లపొదల్లో మృతదేహాన్ని భుజాలపైన మోసుకెళ్లేందుకు వీలు లేక చివరకు చేతుల మీదుగా తీసుకెళ్లాల్సి దుస్థితి. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీలోనున్న లింగాపురం గ్రామంలో సుమారు రెండు వేల మంది జనాభా ఉన్నారు. ఇక్కడి వారికి శ్మశాన వాటికకు వెళ్లేందుకు సరైన దారి లేక నిత్యం అవస్థలు పడుతున్నారు. గురువారం ఓబన్న అనే వ్యక్తి గుండె సమస్యతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు మృతదేహాన్ని శ్మశానవాటిక తీసుకువెళ్లేందుకు అతని కుటుంబ సభ్యులు నానా తిప్పలు పడ్డారు. వర్షం ధాటికి బురద నేలలో నడిచేందుకు వీలు లేక ముళ్లపొదల్లో అవస్థలు పడ్డారు. మృతదేహాన్ని భుజాలపై ఎత్తుకెళ్లేందుకు కూడా వీలులేక చేతులతో పట్టుకెళ్లారు. ఇక శ్మశాన వాటిక ఇప్పటికే ఆక్రమణకు గురికావడంతో ఉన్న కొద్దిపాటి స్థలంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. కూర్చునేందుకు అరుగులు, నీటి సౌకర్యం, కనీసం శ్మశాన వాటికకు సరైన దారి కూడా లేదని వాపోతున్నారు. ఈ సమస్యపై కొత్తపల్లె ఎంపీటీసీ సభ్యుడు గోపాల్‌తోపాటు ఇతర ప్రజాప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశంలో పలుమార్లు అధికారులకు సమస్యను విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఖరి మజిలీలో మృతదేహాలకు దక్కుతున్న గౌర వం ఇదేనా అని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

రైల్వే ఉద్యోగాలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థులు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గురుమూర్తిరెడ్డి

ప్రొద్దుటూరుటౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 2021 సంవత్సరం పూర్వ విద్యార్థులు రైల్వేలో జూనియర్ ఇంజనీరు ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ గురుమూర్తిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అభినంద నందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల పూర్వవిద్యార్థులు మస్తాన్‌వలి, తులసి, మహమ్మద్‌గౌస్, చౌడయ్యలు జేఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపిక కళాశాల ప్రతిష్ఠను పెంచిందన్నారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జెనెటిక్స్ అండ్ జినోమిక్స్ ప్రతిభావంతులకు బంగారుపతకం


ఒప్పంద పత్రాలను అందిస్తున్న వీసీ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఎంఎస్సీ జెనెటిక్స్ అండ్ జినోమిక్స్ విభాగం ప్రతిభావంతుల కోసం బంగారు పతకం ఏర్పాటు చేసింది. ఇందుకోసం విభాగ అధ్యాపకులు రూ.1.25 లక్షలు విశ్వవిద్యాలయానికి అందించారు. వడ్డీతో ప్రతి సంవత్సరం అత్యుత్తమ ర్యాంక్ సాధించిన విద్యార్థికి స్నాతకోత్సవంలో బంగారు పతకం ప్రదానం చేయనున్నారు. ఈమేరకు అధ్యాపకులు డాక్టర్ ఎ.మునికుమారి, డాక్టర్ ఎల్.దాక్షాయణి, డాక్టర్ బి.రమేష్, డాక్టర్ పి.ఉస్మాన్ బాష, వీసీ ఆచార్య రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ పద్మ, పరీక్ష నియంత్రణ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృష్ణారావుతో ఒప్పందం పత్రాలపై సంతకాలు చేశారు. అధ్యాపకుల ఉదారతను వైస్ చాన్సలర్ అభినందించారు.

పిల్లల పట్ల ప్రేమగా వ్యవహరించండి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రమాదేవి

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కేంద్రంలోని పిల్లల పట్ల ప్రేమగా వ్యవహరించాలని సిబ్బందికి ఐసీడీఎస్ పీడీ రమాదేవి సూచించారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పిల్లలకు సంబంధించిన చట్టాలు, శిశు సంరక్షణ సంస్థల్లో కనీస సంరక్షణ ప్రమాణాలు, రక్షణ నిర్వహించడంపై చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ నిర్వాహకులకు, సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాల్లో తల్లిదండ్రులు కోల్పోయి కుటుంబ బాంధవ్యాలకు దూరమైన పిల్లలు ఎక్కువగా ఉంటారన్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బంది పిల్లల పట్ల ప్రేమగా ఆప్యాయతతో వ్యవహరిస్తే.. వారు మానసికంగా దగ్గరై వారి సమస్యలను మనతో పంచుకుంటారన్నారు. అనంతరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ హాస్పిటల్ కడప ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాలకు వచ్చే పిల్లల మానసిక పరిస్థితిని గుర్తించి వారికనుగుణంగా ప్రేమతో వ్యవహరిస్తే మార్పు తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవిప్రకాశ్‌రెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి బీఆర్ సుభాష్‌యాదవ్, జిల్లా బాలల పరిమితుల విభాగం ప్రొటెక్షన్ ఆఫీసరు సునీత, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ప్యానెల్ అడ్వకేట్ శాంత, నోడల్ ఆఫీసరు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

సీనియార్టీలో న్యాయం చేయాలి


ఏపీ జెన్‌కో ఎండీని కలిసిన ఆర్టీపీపీ భూనిర్వాసితులు

ఎర్రగుంట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీకి భూములు కోల్పోయి ఉద్యోగాలు పొందిన వారు సీనియార్టీ విషయంలో న్యాయం చేయాలని ఎండీ నాగలక్ష్మిని కోరారు. గురువారం సాయంత్రం విజయవాడలోని విద్యుత్ సౌధలో కలమల్ల, సున్నపురాళ్లపల్లె, ఇండ్లసిద్దాయపల్లె, ఇతర చుట్టుపక్కల గ్రామాలకు చెందిన నిర్వాసితులు ఎండీతో పాటు హెచ్‌ఆర్ డైరక్టర్ ఉష, ఇతర అధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1988లో ఆర్టీపీపీ నిర్మాణానికి భూములిచ్చామన్నారు. 2011, 2013లో జీవో నెంబరు 98 ప్రకారం 50శాతం పోస్టులను ల్యాండ్ లూజర్లకు కేటాయించారన్నారు. మిగిలిన 50శాతం రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకాలు జరిగాయన్నారు. గత 12 సంవత్సరాలుగా భూనిర్వాసితులకు మొదటి ప్రాధాన్యతతో, అనంతరం రిక్రూట్‌మెంట్ ద్వారా వచ్చిన వారికి మెరిట్ ఆధారంగా సీనియారిటీ అమల్లో ఉందన్నారు. అయితే తాజాగా సీనియారిటి జాబితాను మార్పులకు గురిచేసి భూ నిర్వాసిత ఉద్యోగులను వెనక్కినెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ పేరుతో 12 సంవత్సరాల తర్వాత సీనియారిటిని తారుమారు చేయడం అన్యాయమన్నారు. భూములిచ్చిన వాళ్లమని, స్థానిక హక్కు సీనియారిటీ తమకే ఉందన్నారు. సీనియారిటీ పేరుతో తమ జీవితాలతో చెలగాటమాడవద్దన్నారు. తమకు అన్యాయం జరిగితే స్థానిక గ్రామాల ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామన్నారు.

జమ్మలమడుగులో డీడీవో కార్యాలయం ప్రారంభం


డీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, పక్కన భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో గురువారం డివిజనల్ అభివృద్ధి కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్రంలోని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల ద్వారా రాష్ట్ర అభివృద్ధి కోసం ఏర్పాట్లు చేయబోతున్న కార్యాలయాల ప్రారంభోత్సవ వర్చ్యువల్ కార్యక్రమం జరిగింది. అందులో భాగంగా జమ్మలమడుగు నియోజకవర్గంతో పాటు ప్రొద్దుటూరు, రాజుపాళెం, దువ్వూరు, చాపాడు, పది మం డలాలకు కలిపి జమ్మలమడుగులో డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయం ప్రారంభం కావడం సంతోషకరమని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, వైస్‌ఛైర్మన్ మల్లికార్జున, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు గౌస్ అహమ్మద్, ఎస్.షబ్బీర్, కె.రఫి, అందె జగన్‌మోహన్‌రెడ్డి, కిరణ్‌రాయల్, కర్నాటి రామాంజనేయరెడ్డి, డీఎల్‌పీవో నూర్జహాన్, ఎంపీడీవో సైదున్నీసా, రామచంద్రారెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ జంబోరీలో కడప స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతిభ


స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్‌లో నవంబరు 23 నుంచి 29 తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలో జరిగిన 19వ జాతీయ జంబోరీలో కడప జిల్లా నుంచి ఖాదర్ బాష, చంద్రావతి నేతృత్వంలో 50మంది పాల్గొన్నారు. స్టేట్ ఎక్స్‌ో అడ్వెంచర్, స్టేట్ డే, క్యాంప్ క్రాఫ్ట్ వంటి విభాగాల్లో వారు ప్రతిభ కనబర్చారు. దేశస్థాయి పేజెంట్ షోలో అన్నమాచార్య కళాశాల రెంజర్లు కోమందురు పవిత్ర, సుమన సుజ ప్రదర్శనలు ఆకట్టుకొని ఉత్తమ పురస్కారం అందుకున్నారు. వీరిని డీఈఓ, చీఫ్ కమీషర్ డాక్టర్ షంషుద్దీన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వెంకట సుబ్బయ్య, అహమ్మద్ సగినాల, జగదీష్, అమర్నాథ్‌బాబు, రాజేష్, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రావతి, పావని తదితరులు పాల్గొన్నారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌లో ఉద్యోగ అవకాశాలు


అవగాహన కల్పిస్తున్న ఐబీఎం ప్రతినిధి జ్ఞాన్‌యల్లా

వేంపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ కంప్యూటింగ్‌పై విద్యార్థులు శిక్షణ పొందితే ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని ఐబీఎం కంపెనీ ప్రతినిధి జ్ఞాన్‌యల్లా తెలిపారు. గురువారం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఐదు రోజుల పాటు జరిగే శిక్షణ సమావేశంలో జ్ఞాన్‌యల్లా మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్‌లో కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్తులో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. ఆయా కోర్సుల గురించి విద్యార్థులకు, ట్రిపుల్ ఐటీలో పని చేస్తున్న అధ్యాపకులకు వివరంగా తెలియజేశారు. డైరెక్టర్ గుప్త, ఏఓ రవికుమార్, ట్రిపుల్‌ఐటీ అధికారులు పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు


నేత్రదానం చేస్తున్న చలపతి కుటుంబ సభ్యులు

కొండాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మృతి చెందిన వ్యక్తి కళ్లు దానం చేయడంతో ఇద్దరికి చూపు దక్కనుందని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. కొండాపురం పట్టణానికి చెందిన వెంకటాచలపతి (80) అనే వ్యక్తి గురువారం మృతి చెందాడు. ఆయన కుమారులు బాలాజీ, సంజీవ్‌లు తన తండ్రి కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. అనంతపురానికి చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యం లో కొండాపురంకు చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి హాజీవలి, డాక్టర్ కుళ్లాయిప్ప, టెక్నీషియన్లు రాఘవేంద్ర, విజయభాస్కర్‌రెడ్డి చలపతి నివాసం చేరుకుని ఆయన నేత్రాలను సేకరించారు. ఈ కళ్లను రెడ్‌క్రాస్ సొసైటీకి తరలించారు.

పోలీసు స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

కడప క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌకు పోలీసుస్టేషన్ ఎదుట గురువారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలిలా.. కడప మృత్యుంజయకుంటలో నివాసం ఉంటున్న మహ్మద్‌రఫి, అమ్మాజీల కుమారుడు పెద్దకుళ్లాయప్ప (18) పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో అతని తల్లి చిన్నచౌకు పోలీసుస్టేషన్ వద్దకు వెళ్లి తన కుమారుడిని విడిపించకపోతే ఆత్మహత్యకు పాల్పడతానంటూ విష ద్రావణం తాగింది. వెంటనే ఆమెను పోలీసులు వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ఈక్రమంలోనే అమ్మాజీపై కూడా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ భర్త మాట్లాడుతూ తమ కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని, పోలీసులు ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు కేసులు పెట్టి ఇరికించారని ఆరోపించారు. దీంతో తన భార్య తీవ్ర మానసిక వేదనకు గురై ఈ సంఘటనకు పాల్పడినట్లు తెలిపారు.

ముంబై పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు

కడప క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధి నకాశ్ ప్రాంతంలో నివశిస్తూ రెండేళ్ల కిందట ఆసిఫ్ అనే వ్యక్తి ముంబైకి జీవనాధారం కోసం వెళ్లాడు. అక్కడ ఏడాదిన్నర క్రితం ఓ హత్యకు పాల్పడ్డాడు. తరువాత చాలా కాలం పోలీసులకు దొరకకుండా కడపకు వచ్చాడు. పోలీసులు అతన్ని ఫోను ద్వారా ఆధునిక టెక్నాలజీ ద్వారా కనుగొని కడపకు వచ్చారు. టూటౌన్ ప్రాంతంలో ఉన్న ఆసిఫ్‌ను తమ వెంట తీసుకుని వెళ్లారు.

జాతీయ స్థాయి పోటీలకు సింహాద్రిపురం విద్యార్థి ఎంపిక


ప్రతిభ కనపరచిన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్

సింహాద్రిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన హబీబూర్ రహిమాన్ అనే విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు శ్రీ వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ ఖాదర్‌వలీ తెలిపారు. కృష్ణా జిల్లా గన్నవరంలో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 బాల బాలికల విభాగంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జితేంద్ర, హుస్సేన్ బాషా, అతికుల్ రెహమాన్ కూడా రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచి కాస్యం పతకం సాధించారన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన హబీబూర్ రెహమాన్ ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ జాఫర్ వలీ, పీడీ త్రిలోక్‌నాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు ఆన్‌లైన్ కోర్సులపై అవగాహన సదస్సు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం సురభి సెమినార్ హాల్‌లో స్వయం, స్వయం ప్లస్, మూక్స్‌పై 5వ తేదీ శుక్రవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు వైవీయూ స్వయం ప్లస్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌పీ వెంకటరమణ తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మురుగన్ కీలకోపాన్యాసం చేస్తారన్నారు. పీఎం ఉషా కోఆర్డినేటర్ డాక్టర్ టి.చంద్రశేఖర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

15న శ్రీవారి కల్యాణం

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గోవిందమాల భక్తబృంద సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ ఉత్సవాన్ని ఈనెల 14, 15 తేదీల్లో వైభ వంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కడప మున్సిపల్ మైదా నంలో 14న ఉదయం సుప్రభాతంతో కార్యక్రమం మొదలవుతుంది. కొలువు అనంతరం గోపూజ, మూలవర్లకు అభిషే కాలు, నిశ్చితార్థం నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం సువాసీనీలతో సామూహిక కుంకుమార్చన ఎదురోకో లోత్సవం నిర్వహిస్తారు. 15న ఉదయం 9గంటలకు పచ్చని తోరణాలు, మంగళవా యిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చార ణలు.. అన్నమయ్య సంకీర్తనల మధ్య వైభవంగా శ్రీవారి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 5గంటలకు నిర్వహించే గ్రామోత్సవంలో గరుడ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి నగర ప్రజలకు దర్శనమివ్వనున్నారు. మున్సిపల్ మైదానం నుంచి ప్రారంభమయ్యే ఈ నగరోత్సవం కోలాటా లు, చెక్కభజన, బ్యాండ్ మేళాలు, పంచ వాయిద్యాలు, బాణసంచా వెలుగుల మధ్య అప్సర సర్కిల్, ఎన్జీవో కాలనీ, వైజంక్షన్, ఆర్టీసీ బస్టాండు, కోఆపరేటివ్ కాలనీ, అన్నమయ్య సర్కిల్ వరకు సాగనుంది. భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని గోవిందమాల భక్త బృంద సేవాసమితి ఛైర్మన్ మాదు పుల్లారెడ్డి కోరారు.

స్క్రబ్ టైఫస్ పట్ల అప్రమత్తత అవసరం

కడప కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల వ్యాప్తి చెందుతున్న స్క్రబ్ టైఫస్ ఫీవర్‌ను అరికట్టేందుకు వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రజా దృక్పథం, సీజనల్ వ్యాధులు, ఆరోగ్య శాఖ ప్రాధాన్యతలు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ అదితిసింగ్‌లు హాజరయ్యారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు చేపడుతున్న అభివృద్ధి, ప్రత్యేక అమలు కార్యక్రమాలను అధికారులు బాధ్యతగా పూర్తి చేయాలన్నారు.

కొనసాగుతున్న ఏసీఏ అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు కొనసాగుతున్నాయి. గురువారం ఏసీఏ క్రికెట్ మైదానంలో రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్-నార్త్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ నార్త్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 55.2 ఓవర్లలో 111 పరుగుల స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్ విన్నర్స్- సౌత్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య మ్యాచ్ సాగింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు 21 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 88 పరుగుల స్వల్ప స్కోర్ చేసింది. బౌలింగ్ విభాగంలో సెంట్రల్ జోన్ విన్నర్స్ బౌలర్ వికెష్ 4 వికెట్లు పడగొట్టారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్టు వెలుతురు సరిగా లేకపోవడంతో మ్యాచ్ మధ్యలోనే నిలుపుదల చేశారు.

కేఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్-రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్ జట్టు 55 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసింది. ఇందులో రిషి 66 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు వెలుతురు సరిగా లేని కార ణంగా ఆట మధ్యలోనే నిలిపేశారు.

సంకల్పం ముందు వైకల్యం చిన్నదే

మనోధైర్యంతో ముందుకు సాగాలి ● న్యాయాధికారి ఉమర్ ఫరూక్

అమ్మచెరువు మిట్టలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు ● వైభవంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



తంబళ్లపల్లెలో పిల్లలతో కేక్ కట్ చేయిస్తున్న న్యాయాధికారి ఉమర్‌ఫరూక్ - అమ్మచెరువుమిట్టలో దివ్యాంగుల ప్రదర్శనను అభినందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష, వెలుగు సెక్రటరీ ఉదయమోహన్ రెడ్డి - ములకలచెరువులో బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ వెంకటరమణ

తంబళ్లపల్లె, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): సాధించాలన్న సంకల్పం ముందు వైకల్యం చిన్నదేనని, వైకల్యం అనేది శరీరానికే తప్ప మనసుకు కాదని తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్ ఫరూక్ అన్నారు. గురువారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులు దృఢ సంకల్పంతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. మనోధైర్యంతో అంగవైకల్యాన్ని ఎదుర్కొని ఉన్నత శిఖరాలను అందుకున్న గొప్పవారెందరో ఉన్నారని వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. వైకల్యం ఉందని నిరుత్సాహ పడకుండా అవకాశాలు అందిపుచ్చుకుని విజయాలు సాధించాలన్నారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులతో కేక్ కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. పిల్లలకు నోటుపుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్‌ఎం సాంబశివ, శ్రీనివాసులు, రిసోర్స్ టీచర్లు రేఖ, శ్రావణి, ఫిజియోథెరపిస్టు సరళకుమారి, కేర్‌గివర్ గంగరత్నమ్మ, సీఆర్పీ సుధాకర్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మచెరువు మిట్టలో...

మదనపల్లె అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో వైభవంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. అమ్మచెరువు మిట్ట వెలుగు ప్రత్యేక పాఠశాలల్లో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో ఎమ్మెల్యే షాజహాన్ బాష మాట్లాడుతూ ప్రతి చిన్నారి మొహంలో చిరునవ్వు చూడడానికి సహకరిస్తానన్నారు. వెలుగు బదిరులకు హియరింగ్ ఎయిడ్స్, శారీరక వైకల్యం ఉన్న చిన్నారులకు వీల్ చైర్స్ అందించారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. దివ్యాంగుల విన్యాసాలను, ప్రదర్శనలను తికించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు డ్యాన్స్ రెడ్డెప్ప, వెలుగు సెక్రటరీ ఉదయ మోహన్ రెడ్డి, రఘునాథ రెడ్డి, కన్వీనర్ బాగ్యలక్ష్మీ, మెంబరు సుజాత, ప్రిన్సిపాల్ లీనాకుమారి, వార్డెన్ స్వీటీ, సోషియల్ వర్కర్ గీత, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో ఎంఈఓ రాజగోపాల్ మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు అందిస్తున్న సేవలను వారి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దివ్యాంగుల అసోసియేషన్ అధ్యక్షుడు మౌలాలి, హెచ్‌ఎం భారతి, భవిత సహిత విద్యా ఉపాధ్యాయులు నాగేంద్ర, రెడ్డమ్మ, ఫిజియోథెరపిస్ట్ షాహిన్ తాజ్, రెడ్డిరాణి, స్కూల్ అసిస్టెంట్ రామచంద్ర, కృష్ణమూర్తి, రఘు, చంద్ర, అంధ ఉపాధ్యాయులు గురుప్రసాద్, గిరిబాబు, దివ్యాంగుల పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దిగువపేట తూర్పు పాఠశాలలో...

రామసముద్రం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దిగువపేట తూర్పు పాఠశాలలో హెచ్‌ఎం కె.హేమలత ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.హేమలత మాట్లాడుతూ సామాజిక అభివృద్ధిలో దివ్యాంగులను కూడా భాగస్వాములు అయ్యేలా చూడాలన్నారు. దివ్యాంగ పిల్లల శ్రేయస్సును, వారి అభివృద్ధిని కోరుకుంటూ వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించడం లక్ష్యంగా ఉండాలన్నారు. దివ్యాంగులకు ఏపీ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తూ వారి విద్యాభివృద్ధికి సహకరిస్తోందని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సామాజిక అభివృద్ధిలో పురోగతిని సాధించాలన్నారు. ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, నారాయణస్వామి, జాన్‌బాబు పాల్గొన్నారు.

ములకలచెరువు భవిత కేంద్రంలో...

ములకలచెరువు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈఓలు వెంకటరమణ, శంకరయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాధ, ఉపాధ్యాయులు వేమనారాయణమ్మ, కళావతి, నీర. రమణప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

అభయాంజనేయుడికి పౌర్ణమి పూజలు



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు - పౌర్ణమి పూజలందుకుంటున్న కార్యసిద్ధి అభయాంజనేయస్వామి

వాల్మీకిపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి దేవాలయంలో గురువారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మార్గశిర పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రత వేడుకలు, హోమాది కార్యక్రమాలు చేశారు. సాయంత్రం ఆలయ మండపంలో విశేషాలంకరణలతో వేసిన కల్యాణ వేదికపై వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వాముల వారిని అధిష్ఠింప చేసి మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణలు, అశేష భక్తజనం నడుమ కల్యాణోత్సవాలు కమనీయంగా సాగాయి. అనంతరం ఆలయంలోని కార్యసిద్ధి అభయాంజనేయస్వామికి ఆకుపూజ, సింధూర పూజ, వడమాలసేవలు అనంతరం పౌర్ణమి వెలుగులో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈసందర్భంగా వేడుకల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దత్త జయంత్యుత్సవం



కలకడ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): బాలయ్యగారిపల్లి పంచాయతీ నల్లగుట్టపల్లి మర్రిచెట్టు వద్ద వున్న ఆలయంలో గురువారం దత్తజయంతి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, గోపూజ, కలశస్థాపన, నవగ్రహ ఆరాధన, హోమాలు అనఘాదేవి వ్రతము, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం తదితర పూజ నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి దాకా అన్నదానం చేశారు. సమీప గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ధర్మకర్త రేవూరి రామయ్య, గ్రామస్తులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మూడు ఆలయాలకు ధూప దీప నైవేద్యం మంజూరు

కలికిరి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు ఆలయాలకు ధూప దీప నైవేద్యం పథకం కింద నిధులు మంజూరు చేస్తూ దేవాదాయ కమిషనరు కె.రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. మునేళ్ళపల్లె గ్రామంలోని దండువారమ్మ ఆలయానికి, పారపట్లలోని కోదండరామాలయానికి, కొటాల వద్ద వున్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయానికి ఇక నుంచి ప్రతి నెలా ధూప దీప నైవేద్యం పథకం కింద నిధులు మంజూరు చేయనున్నట్లు ఈ ఆదేశాల్లో పేర్కొన్నారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి పల్లకీ ఉత్సవం



స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

పీలేరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయంలో గురువారం స్వామి వారికి పల్లకీ సేవ అత్యంత వైభవంగా జరిగింది. ప్రతి నెలా పౌర్ణమి రోజున స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించడం ఆలయ ఆనవాయితీ. ఆ ఆనవాయితీని కొనసాగిస్తూ గురువారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో ఊరిగించారు. చెన్నకేశవ స్వామి భజన మండలి సభ్యులు గురువారం సాయంత్రం ఆలయంలో భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మంజుల, పాలక మండలి సభ్యులు, ఉభయదారులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ వ్రతం



వ్రతం చేస్తున్న వేదపండితులు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ఆలయంలో సాయంత్రం బెంగళూరుకు చెందిన వేదపండితులచే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణపతి, సత్యనారాయణస్వామి ఉత్సవవిగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు సత్యనారాయణ స్వామి చరిత్రను వివరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేపట్టారు.

స్క్రబ్ టైఫస్ పట్ల అవగాహన



చింతపర్తి వారపు సంతలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

వాల్మీకిపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల గ్రామీణ ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జులేఖాబేగం సూచించారు. వారపు సంతలో వైద్యాధికారులు, సిబ్బంది అవగాహన చేపట్టారు. స్క్రబ్ టైఫస్ అనేది చిగ్గర్ అనే చిన్న పురుగు కాటు వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్ అని, ఇది సాధారణంగా పొలాలు, గడ్డి, పొదలు, పశువుల గాటిళ్ల ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయన్నారు. పురుగు కాటు వేసిన చోట నల్లటి మచ్చలు ఏర్పడి తీవ్రంగా జ్వరం రావడం, శరీర నొప్పులు, తల నొప్పి, అలసిపోవడం, తదితర బలహీనతలు ఉంటాయన్నారు. వ్యాధి నిర్ధారణ అనంతరం చికిత్స పొందడం ద్వారా నివారించవచ్చన్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధి బారిన పడకుండా లక్షణాలు ఉన్న ఎడల సమీప ఆశా వర్కర్లకు సమాచారం ఇవ్వాలని తద్వారా చికిత్స చేయించుకోవాలన్నారు. సీహెచ్‌ఓ అరుణ, సూపర్‌వైజర్ బానుబీ, వైద్యసిబ్బంది హృదయాశ్వరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎంపిక

పెద్దమండ్యం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు జరిగినట్లు రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ డాక్టర్ జనార్ధనరెడ్డి, జిల్లా కార్యదర్శి సీవీ రమణ వెల్లడించారు. పెద్దమండ్యం మండల ఎస్టీయూ అధ్యక్షురాలిగా ఎన్. పుష్పలతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శిగా జి. నాగప్ప ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు తెలిపారు. ఎన్నికల అధికారి అరవ వేణుగోపాల్‌రెడ్డి వ్యవహరించినట్లు తెలిపారు. మండల, జిల్లా సభ్యులు క్రిష్టయ్య, నాగప్ప, లక్ష్మీదేవి, సీవీ రమణ, మధుకరరెడ్డి, మల్లికార్జునరెడ్డి, మాధవి, రాజేంద్ర, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

విత్తన కాయల పంపిణీ

పెద్దతిప్పసముద్రం డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుసేవా కేంద్రంలో గురువారం ఏఓ ప్రేమలత రైతులకు సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. ఏఓ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల రైతులకు రబీ సీజన్‌కు వ్యవసాయ బోర్ల కింద వేరుశనగ పంటను సాగు చేసుకునేందుకు ప్రభుత్వం రూ.1667కే విత్తన కాయలను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. కావాల్సిన రైతులు తమ గ్రామ పరిధిలోని సచివాలయంలో వ్యవసాయ శాఖ సహాయకుల వద్ద పాసుబుక్కు తీసుకుని వెళ్లి నమోదు చేసుకుంటే వేరుశనగ విత్తన కాయలను అందజేస్తామన్నారు.

మార్కెట్ అభివృద్ధికి సహాయం అందించండి

● డిప్యూటీ సీఎంకు చైర్మన్ వినతి



డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు వినతి పత్రం ఇస్తున్న శివరామ్

మదనపల్లె టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌యార్డు అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్ విన్నవించారు. గురువారం చిత్తూరు పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను కలిసిన ఆయన మదనపల్లె మార్కెట్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై, అవసరమైన నిధులు కోరుతూ వినతి పత్రం అందించారు. పట్టణ నడిబొడ్డున వున్న మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్య వస్తోందని, ఈ మార్కెట్‌ను పట్టణం వెలుపలకు మార్చాలని ఆయన కోరారు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

'బాస్' ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాలకుంట శ్రీనివాసులు

పీలేరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20, 21వ తేదీల్లో జరగనున్న భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) ఆవిర్భావ దినోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలకుంట శ్రీనివాసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక బాస్ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2012 డిసెంబరు 20వ తేదీన మదనపల్లెలో 'బాస్' పురుడు పోసుకుందన్నారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, జాతీయ అంబేడ్కర్ బ్యాంకు, భూమి లేని నిరుపేదలకు సాగుభూమి, మూడు సెంట్ల భూమి, రూ.10 లక్షల నిర్మాణ సాయం, సబ్-ప్లాన్ నిధుల సద్వినియోగం, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసుల వేగవంత విచారణ వంటి అంశాలపై పోరాడుతూ అంచెలంచెలుగా ఎదిగి నేడు 13 రాష్ట్రాలకు విస్తరించిందన్నారు. విజయవాడలో జరిగే ఆవిర్భావ వేడుకల్లో జిల్లాలోని ప్రజలు, బాస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నేతలు మల్లికార్జున, రవీంద్ర, ఆనంద్, హరినాథ్, జనార్దన్, రాజేంద్ర నాయక్, సురేశ్ నాయక్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివరామయ్య

ములకలచెరువు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువు, సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివరామయ్య అన్నారు. నాయనిచెరువుపల్లెలో వారం రోజులు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ క్యాంపు గురువారం నాటితో ముగిసింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సేవా గుణాన్ని అలవరుచుకోవాలన్నారు. నాయనిచెరువుపల్లె గ్రామాల్లో దత్తత తీసుకుని శ్రమదానం, పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంగా ఉండగానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై వివరించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగరాజు, అధ్యాపకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



సోమలలో ప్రజలతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

గుర్రంకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామ, బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టపరిచి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలని వాల్మీకిపురం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నౌషాద్‌అలీ అన్నారు. గురువారం సోమల మండల కేంద్రంలోని 6వ బూత్‌లో నేతలతో కలిసి తిరిగిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలోకి తీసుకెళ్లి పార్టీని బలపరచాలన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రజలకు టీడీపీ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసుల నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసులు, మల్లికార్జున పాల్గొన్నారు.

ఎస్ఐగా పరమేశ్ నాయక్



పెద్దతిప్పసముద్రం డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐగా పరమేశ్ నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న హరిహరప్రసాద్ బదిలీపై వెళ్లడంతో పరమేశ్ నాయక్ పెద్దతిప్పసముద్రానికి వచ్చాడు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటానన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే ఉపేక్షించేది లేదని, ఎంతటివారైనా కేసులు నమోదు చేస్తామన్నారు.

14న హిందూ సమ్మేళనం

పీలేరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న పీలేరులో హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు హిందూ సమ్మేళనం నిర్వాహక సమితి వారు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీలేరు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణలో 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే సమ్మేళనంలో శ్రీనివాస మంగాపురంలోని స్వరూపానందగిరి స్వాముల వారు, చిన్మయ మిషన్ కృష్ణానంద సరస్వతి, ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రచారక్ విజయ ఆదిత్య పాల్గొంటారని వారు తెలిపారు. సమ్మేళనంలో హిందువులు పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

రెడ్డెమ్మ దేవస్థానంలో నేడు వేలం

గుర్రంకొండ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మదేవత దేవస్థానంలో శుక్రవారం వేలం నిర్వహించనున్నట్లు ఈఓ మంజుల తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద పూజాసామగ్రి, టెంకాయలు అమ్ముకునేందుకు ఉదయం 10 గంటలకు దేవదాయశాఖ ఆధ్వర్యంలో వేలం జరుగుతాయన్నారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

సీఎంను కలిసిన గురుప్రసాద్



మదనపల్లె టౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మదనపల్లె జిల్లా సాధన సమితి సభ్యుడు, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో సీఎంను కలిసిన ఆయన జిల్లా ఏర్పాటు పట్ల కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని చంద్రబాబు సూచించినట్లు తెలిపారు.

ప్రజల ఆకాంక్ష నెరవేరింది

మదనపల్లె అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రకటనతో ప్రజల ఆకాంక్ష నెరవేరిందని ఏపీ ఎన్‌జీజీవోస్ అధ్యక్షుడు రెడ్డిశేఖర్, కార్యదర్శి శివప్రసాద్ అన్నారు. గురువారం ఎన్జీవో కార్యాలయంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషను ఏపీ ఎన్జీఓ అసోసియేషన్, పెన్షనర్ సంఘం సభ్యులు సన్మానించారు. గౌరవాధ్యక్షుడు నరసింహారెడ్డి, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి వెంకటరమణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుకు నేడు ఆఖరు

రాయచోటిటౌన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధి 17 మండలాల్లో 48 పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసేందుకు 5వ తేదీ శుక్రవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ పేర్కొన్నారు. డీఎడ్, బీఎడ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు చిట్వేల్, గాలివీడు, రైల్వేకోడూరు, కేవీపల్లి, లక్కిరెడ్డిపల్లె, నందలూరు, పెనగలూరు, పుల్లంపేట, రాజంపేట, రాయచోటి, వీరబల్లి, సుండుపల్లె, మొలకలచెరువు, పెద్దతిప్పసముద్రం, మదనపల్లి, సంబేపల్లె, కలకడ మండలాల్లో పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఎంఈఓలకు దరఖాస్తును అందజేయాలని సూచించారు.